

ఆ టిప్పర్ ఎవరిది!?

- ఇసుక రవాణా అధికారమా.. అనధికారమా?
- సుప్రీం కోర్టు ఆదేశాలు బేఖాతర్
- ఎక్కడి నుంచి తరలిస్తున్నారో అధికారులకే తెలియాలి

సంగం, (ఆంధ్రజ్యోతి): ఓ ఇసుక టిప్పర్ ఆ ఏడుగురి నిండు ప్రాణాలను బలిగొన్నది. అది ఒక వాహనం కాదు.. అక్రమ ఇసుక రవాణాకు చిహ్నం. గ్రీన్ ట్రిబ్యునల్, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అక్టోబరు 15 వరకు ఇసుక తరలింపునకు అనుమతుల్లేవు. అయితే ఆత్మకూరు నుంచి సంగం వైపు వస్తూ ఏడుగురిని బలిగొన్న టిప్పర్ ఏ రీచ్ నుంచి ఇసుక తీసుకువచ్చినట్లో అధికారులకే తెలియాలి. మరోవైపు అధికార పార్టీ ముసుగులో కొందరు నేతలు పెన్నానదిలో ఇష్టారాజ్యంగా యంత్రాలతో ఇసుక తోడేస్తున్నారు. మామూళ్ల మత్తో లేదా అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల ప్రభావమో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం పెన్నా నుంచి అక్రమంగా, అధిక బరువుతో తరలిస్తున్న ఇసుక లోడుతో ఓ టిప్పర్ మృత్యు రథంలా దూసుకొచ్చింది. ఆ వాహన నియంత్రణ కోల్పోయిన డ్రైవర్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొని, ఏడుగురిని పొట్టన పెట్టుకున్నాడు.

ఇంకెందరిని మింగాలి!?



వామ్మో ముంబాయి హైవే!

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి చిహ్నాలైన రహదారులు మృత్యుమార్గాలవుతున్నాయి. నిత్యం ప్రమాదాలతో రక్తమోడుతున్నాయి. నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాలే ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా ఆత్మకూరు, సంగం మధ్యలో హైవేపై ప్రమాదాలు అధికమయ్యాయి. రోడ్డు నిర్మాణంలో లోపాలు.. నామమాత్రపు నిర్వహణ.. కొరవడిన భద్రతా ప్రమాణాలు.. డ్రైవింగ్ నిర్లక్ష్యం.. మద్యం మత్తు.. అతివేగం తదితర అంశాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పెద్దదిక్కును కోల్పోయి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతుంటే.. చేతికందిన బిడ్డలు అకాల మరణంతో బాధిత కుటుంబసభ్యులు కుమిలిపోతున్నారు.

● రోడ్డు భద్రతా కమిటీ ఏదీ!?

జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై నెలకొకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించి, ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో రోడ్డు భద్రతా కమిటీ చెప్పాలి. అంతేగాక వరుస ఘటనలు జరిగితే.. ఘటనా స్థలాలను పరిశీలించి.. అక్కడే ఎందుకు ప్రమాదాలు జరుగుతున్నాయి? లోపం ఏమిటి? నియంత్రణకు ఏం చేయాలి? అనేవి కమిటీ సమావేశంలో చర్చించాలి. ముంబయి జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలతో నష్టం జరుగుతున్నా దిద్దుబాటు చర్యలు లేవు. చిరమన ప్రమాదంతోనైనా అధికారుల్లో చలనం వస్తుందో లేదో వేచి చూడాలి.

అనుకోని ప్రమాదం జరిగిపోయింది. బంధుమిత్రులతో కారులో వెళుతున్న వారిని టిప్పర్ మృత్యువులా దూసుకొచ్చింది. ఒక్కరినీ మిగలకుండా కారులోని ఏడుగురినీ పొట్టనపెట్టుకుంది. దాదాపు నాలుగు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపిన ఈ ఘోరానికి టిప్పర్ ఓ కారణమైతే హైవేపై భద్రతా ప్రమాణాలు లేకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. అంతేగాక నదుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేకపోయినా వందల సంఖ్యల్లో టిప్పర్లు, ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో రోడ్లపై దూసుకుపోతున్నాయి. తెరవెనుక రాజకీయ పార్టీల నాయకులు ఉంటే కళ్లుండి కబోదిలా అధికారులూ వ్యవహరిస్తున్నారు. కారణాలు ఏవైనా రోడ్లపై ప్రయాణమంటే వాహనదారులేకాదు.. ప్రజలు వణికిపోతున్నారు. మరీ ముఖ్యంగా నెల్లూరు-ముంబయి జాతీయరహదారి (నెం.67) అంటేనే అందరి వెన్నులోనూ వణుకు పుడుతోంది. ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేస్తున్న పాలకులు, అధికారులు ఆ తర్వాత చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా ప్రమాదాలు షరామామూలై ఎన్నో కుటుంబాలను శోకసంద్రంలోకి నెట్టేస్తున్నాయి.





ఆ 15 నిమిషాలు గడిచి ఉంటే..

- గమ్యస్థానానికి చేరేవారే!
- ఇంతలో మృత్యువులా దూసుకొచ్చిన టిప్పర్
- ఘటనాస్థలిలో మిన్నంటిన రోదనలు
- డ్రైవర్ తప్ప అంతా బంధువులే



సంగం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సరిగ్గా 15 నిమిషాల్లో వారి ప్రయాణం సాఫీగా సాగి ఉంటే అంతా గమ్యస్థానం చేరి ఉంటారు. ఇంతలో దూసుకొచ్చిన టిప్పర్ ఏడుగురినీ పొట్టనపెట్టుకుంది. సంగం మండలం పెరమన గ్రామం వద్ద బుధవారం మధ్యాహ్నం టిప్పర్ ఓ కారును ఢీకొనడంతో ఏడుగురు మృత్యువాతపడ్డారు. నెల్లూరులోని గుర్రాల మడుగువారి సంఘానికి చెందిన తాళ్లూరు శ్రీనివాసులు (40), భార్య రాధ (38), శేషం సారమ్మ (40), శేషం బాలవెంగయ్య (38), ఇందుకూరుపేటకు చెందిన చల్లగుండ్ల శ్రీనివాసులు (40), భార్య లక్ష్మి (35) వీరంతా బంధువులు. రాధమ్మ బంధువు మధు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను పరామర్శించేందుకు సొంత కారులో వీరంతా బయలుదేరారు. రాధమ్మ నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లోనే పనిచేస్తున్న బ్రహ్మయ్య (24) కారు డ్రైవింగ్ చేస్తున్నాడు. కారు సంగం కొండ దిగి పెరమన సమీపంలోకి వెళ్లగా వేగంగా వస్తున్న ఇసుక టిప్పర్ రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయ్యింది. కారులో ఏడుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

● శ్రమించిన పోలీసులు

సమాచారం అందుకున్న సంగం సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ రాజేష్ వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. కారులో ఇరుక్కున్న మృతదేహాలను వెలికి తీసేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కారు డోర్లు ఓపెన్ కాకపోవడంతో వీలుపడలేదు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, ఆత్మకూరు సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌పేట, చేజర్ల ఎస్‌ఐలు కూడా అక్కడకు చేరుకున్నారు. ఇరుక్కున వాహనాలను రెండు క్రేన్‌లు, ఒక ఎక్స్‌కవేటర్‌తో తీసేందుకు 2 గంటల సమయం పట్టింది. మృతదేహాలను ఒక్కొక్కటిగా బయటకు తీసి ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.



ఘటనాస్థలిలో రోడ్డుపై మృతదేహాలు

● మృతుల వివరాలు తెలియక...

కారులో ఉన్న వారి వివరాలు తెలియక పోలీసులు ఇబ్బందులు పడ్డారు. కనీసం మృతుల ఫోన్లు కూడా కనిపించక ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు ఒక ఫోన్ బయటకు తీస్తే అది పని చేయలేదు. మరో మొబైల్‌లో సిమ్ వేసి మృతుల బంధువులకు సమాచారం అందజేశారు.

● మిన్నంటిన ఆర్తనాదాలు

సమాచారం అందుకున్న మృతుల బంధువులు వెంటనే సంఘటన స్థలానికి వచ్చి బోరున విలపించారు. వారిని సమాదాయించడం ఎవరితరం కాలేదు. అప్పటికే వైద్యశాలకు తరిలించిన మృతదేహాల కోసం ఆత్మకూరుకు తరలివెళ్లారు.

అయ్యో పాపం శ్యాం!

- ఏడాది క్రితం అక్క ఇప్పుడు తల్లిదండ్రుల మృతి



అనాథగా మిగిలిన తాళ్లూరు శ్యాం



మృతురాలు రాధ (ఫైల్)

ఈ బాలుడిపేరు తాళ్లూరు శ్యాం. వయసు 11 ఏళ్లు. నెల్లూరురూరల్‌లోని కొరివారి కండ్రికకు చెందిన దంపతులు తాళ్లూరు శ్రీనివాసులు, రాధలు బాలాజీనగర్‌లో టిఫిన్ దుకాణం నడుపుతున్నారు. సొంత ఇల్లు కొనుకున్న వీరు నెల రోజుల క్రితం ఓ కారు కూడా కొనుగోలు చేశారు. ఈ దంపతులుకు శ్యాంతోపాటు మెర్సీ (13) అనే కుమార్తె కూడా ఉంది. అయితే, ఏడాది క్రితం మెర్సీ మృతి చెందింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడిని ధనలక్ష్మీపురంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో 6వ తరగతి చదివిస్తున్నారు. బుధవారం ఉదయం శ్రీనివాసులు, రాధ కారులో బయలుదేరుతూ పక్కింటి వారికి తమ కుమారుడు వస్తే జాగ్రత్తగా చూసుకోమని చెప్పారు. పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ మృత్యువాత పడ్డారు. తల్లిదండ్రులను, అక్కను కోల్పోయి శ్యాం అనాథగా మిగిలాడు. విషయం తెలుసుకున్న అమ్మమ్మ వాళ్లు ఆ బాలుడ్ని తీసుకెళ్లారు. అభం, శుభం తెలియని శ్యాం ఏం పాపం చేశాడని దేవుడు ఇంత పెద్ద శిక్ష వేశాడంటూ కొరివారికండ్రిక వాసులు కన్నీరుమున్నీరవుతున్నారు.

- నెల్లూరు రూరల్

ఆ ఇంట తీవ్ర విషాదం





శ్రీనివాసులు, లక్ష్మి దంపతులు (ఫైల్)

చల్లగుండ్ల శ్రీనివాసులు (48), చల్లగుండ్ల లక్ష్మి (40)లది ఇందుకూరుపేట అరుంధతివాడ. శ్రీనివాసులు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా, కుమార్తె చందుప్రియ పదో తరగతి, కుమారుడు విశ్వంత్ ఏడో తరగతి చదువుతున్నారు. పెరమన వద్ద జరిగిన ప్రమాదంలో శ్రీనివాసులు, లక్ష్మి మృతి చెందడంతో ఆ పిల్లలు దిక్కులేని వారయ్యారు. అందరితో కలుపుగోలుగా ఉండే ఆ దంపతులు ఇక లేరని తెలియడంతో దళితవాడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- ఇందుకూరుపేట

దోశ శ్రీనివాస్ ఇక లేడా!?



శ్రీనివాస్ (ఫైల్)

నెల్లూరు(క్రైం) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలోని శాలివీధిలో ఓ చిన్న టిఫెన్ సెంటర్ పెద్ద ఫేమస్. ఉదయం, సాయంత్రం ఇక్కడున్న శ్యామ్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అన్ని వార్గాలకు చెందిన వారు టిఫెన్ చేస్తుంటారు. ఇక్కడ దోశ మాస్టర్‌గా ఉండే శ్రీనివాసులు ఎంతో చలాకీగా అందరిని పేరు పెట్టి పిలుస్తూ నవ్వుతూ, నవ్విస్తూ ఉంటాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం టిఫెన్ సెంటర్ వద్దకు వర్కర్లు, కష్టమర్లు చేరుకున్నారు. అయితే, శ్రీనివాసులు, ఆయన భార్య రాధమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలియడంతో అంతా బాధపడ్డారు. మన దోశ శ్రీనివాస్ ఇక లేడా అంటూ కుమిలిపోయారు.

ఆసుపత్రి వద్ద మిన్నంటిన ఆర్తనాదాలు

ఆత్మకూరు : పెరమన వద్ద జరిగిన ప్రమాదంలో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకుని బంధువులంతా ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. సాయంత్రం 6 గంటల తరువాత పోస్టుమార్టం చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయితే, కలెక్టర్ ఆదేశాలతో వైద్యశాల సూపరింటెండెంట్ శేషారత్నం మృతదేహాలను పోస్టుమార్టం చేసేందుకు హుటాహుటిన చర్యలు చేపట్టారు. మరోవైపు మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలంటూ సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈ క్రమంలో ఏఎస్పీ సౌజన్య వైద్యశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

'సోమశిల' సమాచారం

అనంతసాగరం : సోమశిల డ్యాంకు బుధవారం 12,649 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. నీటి నిల్వ 72.690 టీఎంసీలకు చేరుకుంది. డెల్టాకు పవర్ టెన్నల్ నుంచి 1,450, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. వచ్చే వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లను కిందకు దించేశారు.



నెల్లూరులో ఐటీ అధికారులు తనిఖీ చేస్తున్నది డీపీ బంగారు దుకాణంలోనే..

నెల్లూరులో ఐటీ దాడులు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని బంగారు దుకాణాల్లో న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఐటీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించడం కలకలం రేగింది. బంగారు దుకాణాలే టార్గెట్‌గా ఐటీ అధికారులు కేంద్ర బలగాలతో తరలివచ్చి సోదాలు చేయడంపై సర్వత్రా ఉత్కంఠ రేపింది. కాపు వీధి, ఆచారివీధిలలో బంగారం, వజ్రాల వ్యాపార సంస్థలైన డీపీ గోల్డు, డీజే గోల్డు షాపులతోపాటు వారి నివాసాల్లో రాత్రి వరకు తనిఖీలు చేశారు. డీటీ గోల్డు యజమాని దిలీప్‌ను, జేటీ గోల్డు యజమాని రమేష్‌లను, వారి సిబ్బంది, కుటుంబసభ్యులను బంగారం, వజ్రాల వ్యాపారంలో లావాదేవీలపై విచారించారు. అంతేగాక వ్యాపార పుస్తకాలు, బిల్లులను విస్తృతంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిసింది. వ్యాపారులిద్దరూ సోదరులుకాగా, జీరో వ్యాపారం చేస్తూ పన్నులు సక్రమంగా చెల్లించకపోవడం వల్లే ఆదాయ పన్ను అధికారులు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిసింది. ఐటీ దాడుల నేపథ్యంలో మార్వాడీ వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు.

రెండో విడతలోనూ అంతంతే!

- బార్లకు ఆదరణ కరువు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మద్యం బార్లకు దరఖాస్తు చేసుకునేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. జిల్లాలో 56 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేయగా తొలి విడతలో 23 బార్లకు మాత్రమే దరఖాస్తులు అందాయి. దీంతో మిగిలిన 33 బార్లకు ప్రభుత్వం మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. అయినా వ్యాపారస్తుల నుంచి ఆదరణ కనిపించలేదు. 33 బార్లకుగాను బుధవారం రాత్రి వరకు 11 బార్లకు మాత్రమే దరఖాస్తులు అందాయి. నెల్లూరులోని 6 బార్లకు 24 దరఖాస్తులు, కావలిలోని మూడు బార్లకు 12, అల్లూరు, బుచ్చి ప్రాంతాల్లోని రెండు బార్లకు 8 దరఖాస్తులు అందాయి. మొత్తం 11 బార్లకు 44 దరఖాస్తులు వచ్చాయి. వీటికి గురువారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో లక్కీ డిప్ నిర్వహించి బార్లు కేటాయించనున్నారు.

నేడు డీఎస్సీ అభ్యర్థులు గొలగమూడిలో హాజరు కావాలి : డీఈవో

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు గురువారం సాయంత్రం 4 గంటలకు వెంకటాచలం మండలంలోని గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమం వద్ద హాజరై రిపోర్ట్ చేయాలని డీఈవో డాక్టర్ బాలాజీ రావు ఓ ప్రకటనలో సూచించారు. ప్రతీ అభ్యర్థి తప్పనిసరిగా ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, కాల్ లెటర్, డీఎస్సీ హాల్‌టికెట్ తోపాటు తమ వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించే వస్తువులతో హాజరు కావాలన్నారు. 19వతేదీ ఉదయం 6 గంటలకు అభ్యర్థులందరూ బస్సుల్లో బయలుదేరి విజయవాడలో జరిగే ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అక్కడ జరిగే సభలో అభ్యర్థులందరికీ ఉద్యోగ నియామక పత్రాలు అందచేస్తారని పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): భారత దేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటిన ఘనత ప్రధానమంత్రి నరేంద్రమోదీదేనని బీజేపీ నేతలు కొనియాడారు. బుధవారం మోదీ 75వ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని వారు వేర్వేరుగా ప్రభుత్వ ఆసుపత్రిలో, కొట్టాలులోని శ్రీకృష్ణ సేవా ట్రస్టు వృద్ధుల ఆశ్రమంలో కేక్‌లు కట్ చేశారు. అనంతరం రొట్టెలు, పండ్లు, చీరలు పంపిణీ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రామిశెట్టి కళ్యాణ్, మనోహర్‌రెడ్డి, గంజం పెంచల ప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10514
వెండి కిలో ధర	రూ. 131300
వెండి ఒక గ్రాము	రూ. 134.30

జొన్నవాడ కామాక్షితాయికి

బంగారు గాజుల బహూకరణ



బంగారు గాజులను ఆలయ ఈవోకి అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో కామాక్షితా యికి బుధవారం జొన్నవాడకు చెందిన కందిక ట్టు బాలకిరణ్, కవిత దంపతులు 27 గ్రాముల బంగారు గాజులు బహూకరించారు. బంగారు గాజులను ఆలయ ఈవో ఏవీ. శ్రీనివాసులు రెడ్డికి అందజేసి రసీదు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతల గోత్ర నామము లతో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదములు అందజేశారు.

'బెజవాడ' జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ బెజవాడ వంశీకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఘనంగా జరిగాయి. ఆయా మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బెజవాడ వంశీకృష్ణారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రామతీర్థం, ఊటుకూరు, దండిగుంట, వరిణి, పార్లపల్లి, ముదివర్తి, రామచంద్రాపురం, వావిళ్ల గ్రామాల్లో ఆయన అభిమానులు ఘనంగా జన్మదిన కార్యక్రమాలు నిర్వహించారు. బెజవాడ వంశీకృష్ణారెడ్డిని కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో జరిగిన వేడుకల్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కేక్ కట్ చేసి వంశీకృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పలువురు టీడీపీ నాయకులు ఈ సంబరాల్లో పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

విధి నిర్వహణలో సేవలకు గుర్తింపు



డాక్టర్ వెంకటాచలపతి గౌడ్‌ను సన్మానిస్తున్న సహచర వైద్యులు, తదితరులు

కోవూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణకు ప్రాధాన్యమిచ్చి సేవలందించే వైద్యులను ఎప్పుడూ గుర్తుంచుకుంటారని టీడీపీ మండల కమిటీ మాజీ అధ్యక్షుడు ఇంతా మలారెడ్డి అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం జరిగిన డాక్టర్ ఎన్ వెంకటాచలపతి గౌడ్ అభినందన సభలో ఆయన మాట్లాడారు. విధినిర్వహణలో మెరుగైన వైద్యం అందించాలనే తపనతో వెంకటాచలపతి గౌడ్ పనిచేశారన్నారు. పదోన్నతిపై సివిల్ సర్జన్‌గా గూడూరుకు బదిలీకా వడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పొబ్బారెడ్డి మల్లికార్జున రెడ్డి, పీ.వంశీ, డాక్టర్లు లీలావతి, జ్యోతిప్రభ, భారతి, విజేత తదితరులు పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు.

రైతులకు వణుకు పుట్టించిన కారుమబ్బులు



మబ్బులు కమ్ముకోవడంతో హడావుడిగా ధాన్యం బస్తాలను లారీలోకి తరలిస్తున్న కూలీలు

కోవూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్ పరిధిలోని గ్రామాల్లో రైతులను బుధవారం మేఘాలు భయభ్రాంతులకు గురిచేశాయి. కోవూరు పరిసర ప్రాంత గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో గత వారం రోజులుగా వరికోతలు పూర్తి చేసి ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లులకు తరలిస్తున్న క్రమంలో భారీ వర్షాన్ని సూచిస్తూ కారుమబ్బులు కమ్ముకున్నాయి. దీంతో రైతులు హడావుడిగా వరి ధాన్యాన్ని బస్తాలతో సహా లారీల్లోకి చేర్చారు. భారీ వర్షాన్ని ఎదుర్కొనేందుకు వీలుగా టార్పాలిన్ పట్టల్ని కూడా సిద్ధం చేసుకున్నారు. కొద్దిసేపటికి కారుమబ్బులు కాస్తా నీలిమబ్బులుగా మారడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మరో రెండు రోజులు తమ జోలికి రావద్దంటూ వరుణ్ని రైతులు ప్రార్థిస్తున్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి ర్యాలీ



రణభేరిలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పొదలకూరులో ప్రారంభించిన రణభేరిలో భాగంగా బుధవారం బుచ్చిరెడ్డిపాళెం పురవీధుల్లో యూటీఎఫ్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, మాట్లాడుతూ గత 5ఏళ్ల ప్రభుత్వ కాలంలో ఉద్యోగ ఉపాధ్యాయులు అనేక విధాలుగా నష్టపోయారని, ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేశారని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులతో పాఠశాలల్లో పిల్లలకు చదువుచెప్పే పరిస్థితి లేకుండా ఉందన్నారు. అనేక రకాల యాప్‌లతో పాఠశాలలో బోధనకు ఆటంకం జరుగుతుందని, ఉపాధ్యాయులను బోధనేతల కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించి, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు, ప్రధాన కార్యదర్శి జీవీ. చలపతిశర్మ, మరళీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డేవిస్‌పేటలో భారత ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదిన వేడుకలు బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఇన్‌చార్జ్ నాగమణి పాల్గొని స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణంలో స్వచ్ఛ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ భారతదేశ ఖ్యాతిని అగ్రరాజ్యాల సరసన నిలిపారన్నారు. అలాగే మైపాడు తూర్పుపాలెంలో మత్స్యకార సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.గాంధీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నెల్లూరు శ్రీనివాసులు, శివప్రసాద్, చేవూరు వెంకట్రావు, బూత్ ఇన్‌చార్జ్ అత్తిపాటి శరత్, పాకం లలిత, మహేష్, వెంకటకృష్ణ, వెంకటశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు

ఆధార్ తంటాలు!

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ, పెనుబల్లి గ్రామాలకు సంబంధించి పెనుబల్లి సచివాలయంలో గిరిజనుల కోసం బుధవారం ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు అన్నాహారాలు కూడా లేకుండా ఆధార్ నమోదు కోసం నిరీక్షించారు. ఆధార్ లేని వారికి రెవెన్యూ అధికారులు అగ్రామంలో నివాసముంటున్నట్లు ధ్రువీకరణ పత్రాలు ఇస్తేనే ఆధార్ నమోదు చేయాల్సి వుంది. దీనికోసం సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు అందరు సమన్వయంతో గత 3రోజులుగా ఆధార్ కార్డులు లేని గిరిజనులను గుర్తించి వీఆర్వోకి ఆధార్‌కార్డులు అవసరమైనవారి జాబితాను మంగళవారం అందజేశారు. బుధవారం ఆధార్‌సెంటర్ చేరుకున్న బాధితులు రెవెన్యూ అధికారులు రాని కారణంగా సాయంత్రం వరకు నిరీక్షించి ఉసూరుమంటూ వెనుదిరిగారు. మళ్లీ పెనుబల్లిలో ఆధార్‌సెంటర్ ఎప్పుడు పెడతారోనని అసంతృప్తి వ్యక్త చేశారు.

పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయిస్తాం : ఎస్పీ



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ అజిత

పెరమన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తా మని ఎస్పీ అజిత వేజండ్ల పేర్కొన్నారు. విజయవాడలో ఉన్న ఆమె రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకుని హుటాహుటిన పెరమనకు చేరుకున్నారు. సీఐ వేమారెడ్డి ప్రమాద జరిగిన ఘటనను ఎస్పీకి వివరించారు. అనంతరం ఆత్మకూరు వైద్యశాలకు వెళ్లి మృతదేహాలను పరిశీలించి మృతు ల బంధు వులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన టిప్పర్, డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు చెప్పారు. విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని, అంతేగాక ఇసుక రవాణా అనుమతులపైనా విచారి స్తామని చెప్పారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం నెల్లూరులోని ఎస్2 థియేటర్స్ సమీపంలో జరిగింది. 30 నుంచి 35 ఏళ్ల వ్యక్తి మరణించాడు. మృతదేహంపై లేత కాఫీ రంగు టీషర్టు, బులుగు రంగు షార్ట్ ఉన్నాయి. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ఎవరనే ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు.. ఇందుకూరుపేట మండలం రాయుడుపాలెం గ్రామానికి చెందిన జయకృష్ణ(31)కు ఏడేళ్ల కిందట ఆదురుపల్లికి చెందిన లక్ష్మితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. జయకృష్ణ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల దంపతుల నడుమ మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. నాలుగురోజుల కిందట లక్ష్మి భర్తపై అలిగి పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. మంగళవారం జయకృష్ణ భార్య వద్దకు వెళ్లి కాపురానికి రమ్మని కోరాడు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కాని అదే రోజు రాత్రి ఆయన నెల్లూరుకు చేరుకుని నవాబుపేట శివాలయం సమీపంలో రోడ్డుపైనున్న ఐరన్‌పోల్‌కు ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. జయకృష్ణ అన్న హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఎస్ఐ భోజ్యానాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

దుప్పిని చంపిన స్మగ్లర్ అరెస్ట్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అడవిలో తిరుగుతున్న చుక్కల దుప్పిని వేటాడి చంపిన స్మగ్లర్‌ను నెల్లూరు అటవీశాఖ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల ఎస్టీ కాలనీకి చెందిన నంటూరి నాగయ్య మట్టెంపాడు అటవీ ప్రాంతంలో తిరుగుతున్న చుక్కల దుప్పిని చంపి దాని మాంసాన్ని పలు ప్రాంతాల్లో విక్రయించాడు. ఈ సమాచారం తెలుసుకొన్న నెల్లూరు అటవీ రేంజర్ మాల్యాద్రి ఆదేశాల మేరకు సెక్షన్ అధికారి శ్రీనివాసులు, బీట్ అధికారి మనోజ్ కలిసి నాగయ్యను అరెస్ట్ చేశారు. దుప్పి మాంసం, కొమ్ములను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హజరుపరచగా న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు

సీతారామపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ సచివాలయం సమీపాన గల జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సీతారామపురం నుంచి అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీకి ముగ్గురు వ్యక్తులు ఆటోలో బయలుదేరారు. అయ్యవారిపల్లి జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కోన ప్రభాకర్, సన్నాయి మాలిలకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కోన ప్రభాకర్ ను నెల్లూరుకు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కావలిలో చైన్ స్నాచర్ అరెస్టు

- రెండు సవర్ల బంగారు సరుడు స్వాధీనం

కావలిరూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని బంగారం దుకాణాల సెంటర్‌లో బుధవారం తుపాకుల హను అనే చైన్ స్నాచర్‌ను 1వ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి అతని నుంచి 2 సవర్ల బంగారు సరుడు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. పాతూరుకు చెందిన తాతా భవాని ఈనెల 10వ తేదీ పొదుపు నగదు కట్టేందుకు పాతూరులో నడుచుకుంటూ వస్తుండగా బోగోలు మండలం తిప్పకు చెందిన హను మోటారు బైక్‌పై వచ్చి భవాని మెడలోని బంగారు సరుడు లాక్కుని వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు నిందితుడిని గుర్తించి పట్టుకుని అరెస్ట్ చేసి నట్లు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

ఆత్మకూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన బుధవారం ఆత్మకూరు మండలం నబ్బీనగరం వద్ద చోటు చేసుకుంది. ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వింజమూరు నుంచి ఆత్మకూరుకు బయలుదేరింది. ఆ బస్సులో 120 మంది ప్రయాణికులు ఉన్నారు. ఏఎస్‌పేట మండలం తాతిరెడ్డిపల్లి వద్ద మురళి అనే వ్యక్తి కుటుంబసభ్యులను బస్సు ఎక్కించడానికి ఆపాడు. అప్పటికే బస్సు నిండా ప్రయాణికులు ఉండడంతో డ్రైవరు ఆపకుండా వెళ్లాడు. దీంతో ఆగ్రహించిన మురళీ బస్సును వెంబడించి నబ్బీనగరం వద్ద బస్సును క్రాస్ చేసి తన మోటారుబైకును అడ్డుపెట్టి డ్రైవర్ వెంగళరావుపై దాడిచేశాడు. దీనిపై బస్ డ్రైవర్ వెంగళరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో సివిల్ ఇంజనీర్ మృతి



అబ్బూరి వెంకటరావు (ఫైల్)

ఏఎస్ పేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని హైవే సివిల్ ఇంజనీర్ మృతి చెందిన సంఘటన మంగళవారం నెల్లూరు మెడికవర్ ఆసుపత్రి సమీపంలో చోటు చేసుకుంది. మృతిడి బంధువుల వివరాల మేరకు.. ఏఎస్ పేట మండలం హసనాపురం గ్రామానికి చెందిన అబ్బూరి వెంకటరావు (28) తాటిపర్తి సమీపంలో హైవే పనులలో సివిల్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. పెళ్లికి ముహూర్తాలు పెట్టుకోవాలని ఇటీవలే స్వగ్రామమైన హసనపురం వచ్చాడు. నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రిలోని బంధువులను చూసి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బుధవారం పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు చేపట్టారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



పొదలకూరులో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

వెంకటాచలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో బుధవారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. 85 మందికిపైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో నెల్లూరు రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ జనార్ధన్‌రాజు, స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రతినిధులు నాగరాజారెడ్డి, సుబ్బానాయుడు, బీజేపీ జిల్లా కార్యదర్శి అల్లూరు ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల కేంద్రంలో...

వెంకటాచలంలోని సెయింట్ జ్యూడ్స్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పండ్లు, బిస్కెట్స్, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు హసనాపురం శ్రీనివాసులు, బీజేపీ జిల్లా నేతలు కుంచి శ్రీనివాసులు యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, ఆరుమూళ్ల మురళీ, మండల నేతలు గొత్తల నరేష్, మాధవ్, శ్రీహరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

- **పొదలకూరు:** పట్టణంలోని బీజేపీ ప్రాంతీయ కార్యాలయంలో మోదీ జన్మదిన వేడుకలను బుధవారం మండల బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి మోడీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పూల ప్రశాంత్, బీజేపీనాయకులు చింత గింజల సుబ్రహ్మణ్యం, దాసరి సురేంద్ర, ఉపాధ్యక్షులు చొప్పా వెంకటేశ్వర్లు, టౌను అధ్యక్షులు సిరిగిరి ఓబులేష్, మాజీ అధ్యక్షులు ముక్కు అయోధ్యరామయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గురుస్వామి, ఏ.జనార్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- **రాపూరు :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బుధవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వెంకటగిరి బీజేపీ ఇన్‌చార్జ్ ఎస్ఎస్ఆర్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, పాలు అందజేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు దూడల పెంచలయ్య, జయసింహ, తిక్కమనేని వెంకటరత్నం నాయుడు, ప్రదీప్‌రెడ్డి, ఆదిరెడ్డి, డాక్టర్‌లు మమత, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

వెంకటాచలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక విక్రమసింహపురి యూనివర్సిటీలో పర్యావరణ కాలుష్యం, పోషణ, ప్రజారోగ్యంపై గత రెండు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు విచ్చేసి పర్యావరణ కాలుష్యం ప్రభావాలు, పోషకాహారం ప్రాముఖ్యత, ప్రజారోగ్య పరిరక్షణ వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, మెరైన్ బయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం హనుమారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, చంద్రమౌళి, మల్లికార్జున్, ఎల్‌వీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



పిడూరులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు

మనుబోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పిడూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులు తిక్క వరప్రసాదరులు శ్రీధర్‌రెడ్డి, వెంకురెడ్డిలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మనుబోలు హైవే నుంచి మూడు గ్రామాలు కలుపుతూ మరలా హైవే వరకు అంటే 6కి.మీ రోడ్డు నిర్మాణం చేయిస్తామన్నారు. అందులో భాగంగా తొలి విడతలో 2.4కి.మీ మేరకు రూ.1.20కోట్లు మంజూరు చేయించామన్నారు. త్వరలోనే మనుబోలు పీహెచ్‌సీ నూతన భవనాన్ని ఆరోగ్యశాఖ మంత్రిచే ప్రారంభిస్తామన్నారు. అలాగే రూ.3కోట్లతో నూతన హాస్టల్ భవనంకు పునాది వేస్తామన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, కేసీపీసీ ఛైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ సాని వెంకటరమణయ్య, నాయకులు మానుగుంట సుదాకర్‌రెడ్డి, కేవీ కృష్ణయ్య, పద్మనాభరెడ్డి, పచ్చిపాల రామిరెడ్డి, ముంగర విజయభాస్కర్‌రెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, దారా పోలయ్య, ఇరిగేషన్ డిఈ అనీల్‌కుమార్, తహసీల్దార్ రమాదేవి, ఇన్‌చార్జి ఎంపీడీవో ముజీబున్నీసా, కార్యదర్శి అంకయ్య పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కృషి

- **ముత్తుకూరు:** విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ముత్తు కూరులోని ఈదూరు ఈశ్వ రమ్మ జడ్పీ ఉన్నత పాఠశా లలో కార్గిల్ ఇండియా పామాయిల్ పరిశ్రమ సహకారంతో నిర్మించిన భవిత కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అయితే పరిశ్రమల సహకారంతో పాఠశాలలకు మరిన్ని వసతులు కల్పించి ఉత్తమ విద్యాబోధన అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. దివ్యాంగ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు వచ్చి భవిత కేంద్రాన్ని నిర్మించిన కార్గిల్ ఇండియా పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జున్‌యాదవ్, నాయకులు బొమ్మి సురేంద్ర, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఈదూరు రాంప్రదీప్‌రెడ్డి, ఎంపీడీవో నాగమణి, ఎంఈవోలు మధుసూదన్, హేమసుందర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనా రంగంలో

విద్యార్థులు రాణించాలి

- వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిశోధనా రంగంలో విద్యార్థులు మరింత రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు సూచించారు. వీఎస్‌యూలో బుధవారం బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మైక్రోఆర్గానిజం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఓఎస్ ఛైర్మన్ ప్రొఫెసర్ విజయానందకుమార్ బాబు, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ జీ మేరీ సందీప్, డాక్టర్ కే ప్రభాకర్, డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, డాక్టర్ సీ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రైతులు యూరియా వాడకం తగ్గించాలి



పొదలకూరు: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

పొదలకూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి పి సత్యవాణి సూచించారు. బుధవారం మండల పరిధిలోని డేగపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ వరి పంటలో అధికంగా యూరియా వాడటం వలన భూమిలో సేంద్రియ కర్బనం తగ్గుతుందన్నారు. అధిక యూరియా వేసి పండించిన పంటలు తినడం వలన క్యాన్సర్ బారిపడే అవకాశం ఉందన్నారు. రైతులు ప్రభుత్వం వారు సిఫార్సు చేసిన మోతాదులో వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాల కులు కే శివనాయక్, మండల వ్యవసాయాధి కారి వి ప్రతాప్, వ్యవసాయ విస్తరణాధికారి ఏడుకొండలునాయక్, వి.ఏఏ కౌసల్య, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

- **మనుబోలు :** రైతులు వరిసాగులో అధిక యూరియా వాడకం తగ్గించాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య సూచించారు. మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విఏఏలు దివ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

షేక్ పర్వేజ్‌కి డాక్టరేట్ ప్రదానం

వెంకటాచలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో మెరైన్ బయాలజీ విభాగం పరిశోధన విద్యార్థి షేక్ పర్వేజ్‌కు వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. పర్వేజ్ వీఎస్‌యూలో అసెస్మెంట్ ఆఫ్ రెసిడ్యువల్ బిహేవియర్ ఇన్ ఆక్వాకల్చర్ ప్రొడక్ట్స్ ఆఫ్ కోస్టల్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై మెరైన్ బయాలజీ ప్రొఫెసర్, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. దీంతో బుధవారం వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, మెరైన్ బయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం హనుమారెడ్డి తదితరులు షేక్ పర్వేజ్‌ను అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	147
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	286

కోడిగుడ్ల ధర (100): 550



బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చికి సత్కారం

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్‌ను ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం(ఏపీబీఎస్ఎస్ఎస్) నాయకులు బుధవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ బ్రాహ్మణ సాధికార సమితి నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ అద్దంకి సుమతి, ఏపీబీఎస్ఎస్ఎస్ మాజీ అధ్యక్షుడు అద్దంకి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారా శ్రీధర్‌శర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు మంకాల వెంకట సుబ్బయ్య, అర్చక పురోహిత విభాగం జిల్లా అధ్యక్షుడు గట్టుపల్లె పవన్‌కుమార్, కార్యదర్శి జంగా శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

● ఆక్రమణలను వెంటనే తొలగించండి ● టౌన్‌ప్లానింగ్ విభాగానికి కమిషనర్ ఆదేశం

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ హెచ్చరించారు. నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీ పరిధిలోని సర్వే నెంబరు 2222లో ఉన్న ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న ఆక్రమణలపై బుధవారం ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ప్రచురించడంతో యంత్రాంగం స్పందించారు. కమిషనర్, నగర తహసీల్దారు షఫీమాలిక్, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణలను పరిశీలించారు. టిడ్కో నివాసాల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలాలను కొందరు ఇష్టానుసారంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడమే కాకుండా విక్రయాలు చేస్తున్నట్లు నిర్ధారించుకున్నారు. వెంటనే రెవెన్యూ అధికారుల సమన్వయంతో ఆక్రమణలను తొలగించాలని కమీషనర్ ఆదేశించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టిగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం సీటీ ప్లానర్ హిమబిందు, సర్వేయర్లు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ కాలనీలో ఆక్రమించిన స్థలాలను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్, తహసీల్దారు షఫీమాలిక్ తదితరులు



పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

● కమిషనర్ నందన్ ● నగరంలో అవగాహన ర్యాలీ

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ పిలుపునిచ్చారు. బుధవారం స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీని వీఆర్సీ కూడలి వద్ద పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలందరు తమ బాధ్యతను గుర్తించాలని కోరారు. అందరూ చొరవ చూపితేనే స్వచ్ఛ నెల్లూరు సాధ్యమన్నారు. ప్రతీ ఒక్కరు ఇంటింటా చెత్త సేకరణకు సహకరించాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని, ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్, సీపీ హిమబిందు, ఎంహెచ్‌వో కనకాద్రి పాల్గొన్నారు. అంతకుముందు 11,13,14 డివిజన్లలో మున్సిపల్ పార్కులను పరిశీలించి ఆరోగ్య విభాగంపై వారంతపు సమీక్ష నిర్వహించారు.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా పోలీస్‌స్టేషన్ అధికారులు సీహెచ్ కృష్ణారెడ్డి, టీవీ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు పోక్సో యాక్ట్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, శక్తియాప్, మాదక ద్రవ్యాల వినియోగం, యాంటీ ర్యాగింగ్, రోడ్ సేఫ్టీ, నెంబరు 112 పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు, ఏఎస్ఐ వై శ్రీహరి, డీ సతీష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాతోనే అమాయకుల బలి

● ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కూటమి నేతల ధన దాహానికి ఏడుగురు బలయ్యారని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. నగరంలోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీలో జరిగిన అవకతవకలతో అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా వల్ల వందలాది టిప్పర్లు రాష్ట్రాలు దాటి వెళుతున్నాయని తెలిపారు. అతి వేగంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్ ఢీకొని నగరానికి చెందిన ఏడుగురు అమాయకులు ప్రాణాలు కోల్పోయారన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు నేనున్నాను అనే భరోసాను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నగరంలోని ఆమె నివాసంలో బుధవారం 102 మందికి రూ.కోటి విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. అభివృద్ధి, సంక్షేమాలతోపాటు ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంక్ చైర్‌పర్సన్ దొడ్ల విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ బెజవాడ వంశీకృష్ణారెడ్డి, టీడీపీ కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య, జొన్నవాడ ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీపై కాంగ్రెస్ కరపత్రాల పంపిణీ

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఓట్ చోరీపై అవగాహన కోసం కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి సంజయ కుమార్ తెలిపారు. ఓటు చోరీపై రాహుల్‌గాంధీ ఉద్యమం చేస్తున్న నేపథ్యంలో నగరంలో వెంకటేశ్వరపురం పరిధిలోని 53, 54 డివిజన్ల ప్రజలకు కరపత్రాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు నరసాపురం ప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు చోరీపై కరపత్రాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

షిరిడీ పురవీధుల్లో సాయిదర్బార్ పల్లకి ఉత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీసాయిమాలధారణ మండల దీక్ష పూర్తి చేసుకుని నెల్లూరు నుంచి షిరిడీ వెళ్లిన 300 శ్రీసాయిదర్బార్ భక్త బృందం బుధవారం ఉదయం షిరిడీ పురవీధుల్లో శ్రీసాయినామ సంకీర్తనలతో మహాప్రదక్షిణ చేశారు. ఈ పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. గురువారం భక్తులు ఇరుముడి సమర్పిస్తారు. అనంతరం భజన జరుగుతుందని సాయి దర్బార్ మందిరం అధ్యక్షుడు మధుస్వామి తెలిపారు.

సర్దార్ పటేల్‌కు నివాళి



పటేల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్ వద్దనున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ పటేల్ భారత హోం శాఖ మంత్రిగా దేశంలోని అన్ని సంస్థానాలను, రాజులను ఒప్పించి భారతదేశంలో విలీనం చేశారని చెప్పారు. దేశంలోని అన్నీ సంస్థానాలు సెప్టెంబరు 17న విలీనం కావడంతో ప్రధాని మోదీ దేశమంతా జాతీయ సమైక్యతా దినంగా ప్రకటించా రని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మండ్ల ఈశ్వరయ్య, గడ్డం విజయకుమార్, మొగరాల సురేష్, పెంచలయ్య, ఫణిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే డిమాండ్లు నెరవేర్చాలి

● నెల్లూరులో విద్యుత్ జేఏసీ నిరసన

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, విద్యుత్ సంస్థ యాజమాన్యం తక్షణమే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ కొండపల్లి శ్రీనివాసులు కోరారు. నెల్లూరు సర్కిల్ ఆఫీస్ విద్యుత్ భవనం వద్ద మూడవ రోజైన బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. నాయకులు ఎం శ్రీధర్, పీ దామోదర్, టీ శ్రీనివాసులు, వీ వెంకటేశ్వర్లు, సయ్యద్ నవాబ్ జానీ, సయ్యద్ రఫీ, పీ కృష్ణ, షేక్ హజరత్ అలి, నాంచారయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయ ణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. బుధవారం ఆసుపత్రిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేప డుతున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద మహిళల కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య పరీక్షలతోపా టు వివిధ వ్యాధులపై అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. ఆసుపత్రి అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లి దొరసానమ్మ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వైద్యులు డాక్టర్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ విశ్వకుమార్, డాక్టర్ శేషమ్మ, ఏజీఎం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● జిల్లా కార్యదర్శి కృష్ణారావు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నెల్లూరు జిల్లా కార్యదర్శి కృష్ణారావు డిమాండ్ చేశారు. బుధవారం జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ చేసిన తమకు చెల్లించాల్సిన బకాయిల కోసం అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించిన తమ డిమాండ్లు పరిష్కారం కావడంలేదన్నారు. రిటైర్డ్ అయిన వారికి హెచ్‌పీఎల్, ఇంక్రిమెంట్ అరియర్స్ చెల్లించలేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎల్.కిరణ్మయి. జానకిరామయ్య, గురుప్రసన్న, మస్తాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన మహిళతో శక్తివంతమైన కుటుంబం

కలెక్టర్ హిమాన్షు శుక్లా ● స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం



నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన మహిళ శక్తివంతమైన కుటుంబాన్ని, సమాజాన్ని నిర్మించగలదని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. మహిళల ఆరోగ్య పరీక్షల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. స్వస్త్ కార్యక్రమాన్ని ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర డీడీ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాల్లో గుండె జబ్బులు, క్యాన్సర్‌కు సంబంధించి ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. రక్తహీనత, పోషకాహారంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత మాట్లా డుతూ అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వైద్య శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. మహిళల ఆరోగ్యానికి పాటుపడతామంటూ అందరితో ఏడీఎం హెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి ప్రతిజ్ఞ చేయించారు. కాగా, తొలిరోజు జిల్లాలో 117 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వాటిలో 6241 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ పీడీ హేన సుజన, డీసీహెచ్ఎస్ డాక్టర్ పరిమళ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, ఆయుష్ విభాగాధిపతి సరళ, నోడల్ అధికారులు డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ పుట్టినరోజు



వేడుకల్లో బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలో బీజేపీ నాయకులు బుధవారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు, విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. మూలాపేట అలంకార్ సెంటర్, ఈఎస్ఆర్ఎం స్కూల్ తదితర ప్రాంతాల్లో వేడుకలు జరిగాయి. బీజేపీ రాష్ట్ర నాయకురాలు కందికట్ల రాజేశ్వరి మాట్లాడుతూ దేశంలో ప్రజలందరూ మోదీని కుటుంబ సభ్యుడిగా భావిస్తున్నారన్నారు. అనంతరం విశ్వకర్మకు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నరేష్, పద్మావతి, సుబ్బయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని విరాట్‌నగర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. తొలుత పంచవృత్తుల పతాకం ఆవిష్కరణ, పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు, విశేష పూజలు, పూలంగిసేవ అలంకారాలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం శాశ్వత అధ్యక్షులు కందుకూరి చెంగయ్య ఆచారి, పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



విశ్వకర్మ జయంతి పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణులు అన్నీ రంగాలలో అభివృద్ధి చెందాలంటే విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు దువ్వూరు కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం విశ్వకర్మ జయంతిని కంసాలి వీధిలోని శివాలయంలో ఘనంగా నిర్వహించారు. సెప్టెంబరులో కన్యా సంక్రమణం నుంచి విశ్వకర్మ భగవాన్ విశ్వాన్ని సృష్టించే కార్యక్రమం చేపట్టారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాకాటి కోటేశ్వరాచారి, కోశాధికారి ఆనంద్‌కుమార్, లక్ష్మీప్రసాద్, జయశంకర్, కందుకూరు శ్రీనివాస్, ఆర్కాట్ మురళీ, సురేష్, శివ, శరత్, రమేష్ పాల్గొన్నారు.



వైద్యుల సూచన లేకుండా మందులు వాడొద్దు

● జీజీహెచ్‌లో వైద్యుల ప్రదర్శన

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వైద్యుల సూచనలు లేకుండా మందులు వాడరాదంటూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బుధవారం వైద్యులు ప్రదర్శన నిర్వహించారు. ఫార్మాకోలమ్ విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి మాట్లాడారు. వైద్యుల సూచనలు లేకుండా మందులు వాడితే దుష్ప్రభావాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్‌బాషా, ఫార్మాకోలమ్ విభాగాధిపతి డాక్టర్ రాధికారాణి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మునిర్‌ఖన్నా, డాక్టర్ వీరశేఖర్, వైద్య విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరాజ మఠంలో పేజవర మఠం పీఠాధిపతి



వ్యాస మఠంలో పేజవర మఠం పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థులు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వ్యాసరాజ మఠాన్ని పేజవర మఠం పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థులు బుధవారం సందర్శించారు. మఠం మేనేజర్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో భక్తులు స్వాగతం పలికారు. తొలుత మఠంలో స్వామివార్లకు పూజలు చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి భాగవతం అనుగ్రహ భాషణం చేశారు. ముద్రాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరవపల్లి సుబ్బారావు, కంబాలూరు శ్రీధర్ ఆచార్య, కులకర్ణి, దేవర్స్ , నాగరాజారావు, వైభవాచార్యులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా మానవతావాది

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టని మహోన్నత వ్యక్తి, మానవ తావాది గుర్రం జాషువా అని ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి తెలుగు అధ్యయనాచార్యులు, వక్త డాక్టర్ బ్రహ్మానందరెడ్డి తెలి పారు. బుధవారం చేతన సంస్థ నగరంలో నిర్వహించిన జాషు వా కవిత్వం.. మానవీయ దృక్కోణం అంశం మీద ఆయన ఉపన్యసించారు. సభకు కే కుసుమకుమారి, 'చేతన' కార్యదర్శి శేషగిరీశం, సభ్యులు విశ్వనాథం, సుబ్బరాయుడు, నారాయణ స్వామి, ఖాసిం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు సమీపంలో రోడుపై నడిచి వెళుతున్న వృద్ధురాలిని గుర్తుతెలియని యువకుడు బుధవారం రాత్రి బైక్‌పై వెంబ డించి ఆమె మెడలోని ఐదు సవర్ల బంగారు గొలుసును తెంపు కెళ్లాడు. వృద్ధురాలు కేకలు వేస్తుండగానే దుండగుడు పరార య్యాడు. దీంతో బాధితురాలు ఘటనా స్థలంలోనే కుప్పకూలి పోయింది. ఆ వైపుగా వెళుతున్న స్థానికులు ఆమెను రోడ్డుపక్క గా కూర్చోబెట్టి బాలాజీనగర్ పోలీసులకు సమాచారం అందిం చారు. వివరాలు తెలియాల్సి ఉంది.

5న బిజినెస్ మైండ్ సెట్ మాస్టరీ

● అయితా భాస్కర్

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఔత్సాహిక వ్యాపారవేత్తలకు వ్యాపార మెలకువల కోసం అక్టోబరు 5న బిజినెస్ మైండ్ సెట్ మాస్టరీ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పినాకినీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అయితా భాస్కర్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ శిక్షణ శిబిరంలో సైకాలజిస్ట్, కోచ్‌గా సింగంశెట్టి అభిషేక్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం వెంకటేశ్వరపురం బ్రిడ్జి దగ్గరున్న పినాకినీ కన్వెన్షన్ హాలులో జరుగుతుందని తెలిపారు. పాల్గొనదలచిన వారు నర్తకీ సెంటర్‌లో ఉన్న పినాకినీ లయన్స్ క్లబ్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

కసుమూరు దర్గాలో వసతులు కరువు

● భక్తుల ఇక్కట్లు ● నేడు గంధ మహోత్సవం

వెంకటాచలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన మండలంలోని కసుమూరు మస్తాన్‌వలి దర్గాలో సరైన వసతులు లేక భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రతి ఏడాది దర్గా నుంచి వక్ఫ్‌బోర్డుకు రూ. 2 కోట్లకుపైగా ఆదాయం వెళ్తుంది. కానీ భక్తులకు వసతులు కల్పించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● నేడు గంధమహోత్సవం

కసుమూరు మస్తాన్‌వలి 248వ గంధమహోత్సవం గురువారం నుంచి ప్రారంభం కానుంది. 18వ తేదీ గురువారం అర్ధరాత్రి 12 గంటలకు మస్తాన్ స్వామి బంగళా నుంచి గంధం ఊరేగింపుగా బయలుదేరి 19వ తేదీ శుక్రవారం ఉదయం 6 గంటలకు మస్తాన్ వలి దర్గా వద్దకు చేరుతుంది. ఆ తర్వాత దర్గాలో కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ స్వామి వారికి గంధాన్ని చదివింపులు ఇస్తారు. శనివారం ఉదయం చిన్న గంధం (తహలీల్ ఫాతేహ) ఊరేగింపు నిర్వహిస్తారు.

కానరాని ఏర్పాట్లు

248వ గంధమహోత్సవ ఏర్పాట్ల కోసం వక్ఫ్‌బోర్డు రూ.16 లక్షల వరకు మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు ఏర్పాట్లు కానరావడం లేదు. ఏర్పాట్లు సక్రమంగా చేయడం లేదన్న విమర్శలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏటా



గంధమహోత్సవానికి ఒక రోజు ముందే సగానికి పైగా ఏర్పాట్లు పూర్తవుతాయి. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు లైటింగ్, అక్కడక్కడ షామియానాలు మినహా ఏర్పాట్లు ఏం జరగలేదు. మిగిలిన గురువారం ఒక్క రోజులోనే ఏర్పాట్లు అన్ని పూర్తి చేయాల్సి ఉంది.

● ప్రచారం ఊసే మరిచారు..!

కసుమూరు మస్తాన్ వలి 248వ గంధమహోత్సవం ఎప్పుడన్న ప్రచారమే చేయకుండా వక్ఫ్‌బోర్డు అధికారులు చేతులెత్తేశారు. కనీసం ప్రచారమనే ఊసే కనిపించకుండాపోయిందన్న విమర్శలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. కనీసం సుదూర ప్రాంతాల్లో ఉండే భక్తులకు గంధమహోత్సవం ఎప్పుడన్న విషయం కూడా తెలియదన్న సందేహాలు నెలకొన్నాయి. ఈఏడాది గంధమహోత్సవానికి అనుకున్నంత స్థాయిలో ప్రచారం చేయకపోవడంతో భక్తులు రాకపోవచ్చన్న భావన స్థానికులలో వ్యక్తమవుతుంది. దీనికి కారణంగా వక్ఫ్‌బోర్డు అధికారులేనని విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

● దర్గా వద్ద ఆక్రమణలు

దర్గాకు వెళ్లే ప్రధానరహదారిని కొందరు దుకాణదారులు ఆక్రమించేశారు. ఏకంగా రోడ్డుపై సామాగ్రి పెట్టి మరీ విక్రయిస్తున్నారు. కానీ అధికారులు చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. దర్గాకు వెళ్లే భక్తులు అవస్థలు పడుతున్నారు. రద్దీ సమయంలో ఇక్కడ తోపులాటలు జరిగే అవకాశం ఉంది. భక్తులు మొరపెట్టుకున్నా కనీసం వక్ఫ్‌బోర్డు అధికారులు పట్టించుకున్నా దాఖలాలు లేవు.

● అద్దెలు, ధరలు పెంపు

భక్తుల అవసరాలను ఆసరాగా తీసుకుని అద్దె గృహాల నిర్వాహకులు, హోటళ్ల యాజమానులు భారీగా ధరలు పెంచేశారు. సాధారణ రోజుల్లో రూ.300 నుంచి రూ.500 వరకు ఉండే గదుల అద్దెలు ప్రస్తుతం ఏకంగా రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వరకు పెంచేశారు. హోటళ్ల నిర్వాహకులు కూడా ధరలు పెంచి విక్రయిస్తుండడంతో ఏటా భక్తులకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక దృష్టి పెట్టి ప్రశాంతంగా భక్తులు దర్శనం చేసుకొని వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హ్యాపీ బర్త్‌డే పీఎం

ఆకుపై రూపుతో శుభాకాంక్షలు

మనుబోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బుధవారం సూక్ష్మకళాకారు డు సోమా పద్మారత్నం రావి ఆకుపై ఆయన రూపాన్ని గీసి శుభాకాంక్షలు తెలియజేశారు.

‘ఆంధ్ర యువ సంకల్ప్’కు పేర్లు నమోదు చేసుకోండి

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతను భాగస్వాములను చేస్తూ నిర్వహించే ఆంధ్ర యువ సంకల్ప్-2025 రాయబారి డిజిటల్ మారథాన్ కార్యక్రమానికి యువత తమపేర్లను ఈనెల 30లోపు నమోదు చేసుకోవాలని సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వికసిత్ భారత్-2047కు లక్ష్యాలకు అనుగుణంగా సామాజిక బాధ్యత, కుటుంబ సంబంధాలు, ఆరోగ్యకరమైన జీవనం, బాధ్యతాయుతమైన డిజిటల్ ఆవిష్కరణల విలువలను ప్రోత్సహించడానికి ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల నుంచి ఈ థీమ్ తీసుకున్నారన్నారు. దీనిలో పాల్గొనే యువత 18-35 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని తెలిపారు. www.andhrayuvasankalp.com వెబ్‌సైట్‌లో రిజిస్టర్ కావాలన్నారు. వీరు తయారు చేసిన 120 సెకన్ల నిడివి కలిగిన వీడియోలను అధికారిక హాష్‌ట్యాగ్‌లతో సొంత సోషల్ మీడియాలో మార్గదర్శకాల్లో చెప్పిన విధంగా పోస్ట్ చేయాలని సూచించారు. వాటిని జ్యూరీ పరిశీలించి విజేతలను ఎంపిక చేస్తుందని తెలిపారు. ప్రథమ బహుమతి లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి 50వేలు అందిస్తారని పేర్కొన్నారు. అలాగే 9 మంది విజేతలను ఆంధ్ర యువత బ్రాండ్ అంబాసిడర్లుగా సత్కరిస్తారని, అందరికీ సర్టిఫికెట్లు అందచేస్తారని వివరించారు. జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో యువత దీనిలో భాగస్వాములు కావాలని కోరారు.

కొనసాగిన పెన్‌డౌన్!

- సమ్మె ఆపండి : అధికారి సూచన
- డిమాండ్లు నెరవేర్చే వరకు ఆపం
- స్పష్టం చేసిన దస్తావేజు లేఖర్ల నాయకులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో లోపాలు సరిచేయాలని డిమాండ్ చేస్తూ పెన్ డౌన్ పేరుతో దస్తావేజు లేఖరులు చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజు కొనసాగింది. బుధవారం ఏకదశి తిథి మంచి రోజు కావటంతో రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరుగుతాయని భావించారు. కానీ లేఖరుల సమ్మెతో కార్యాలయాలు వెలవెలబోయాయి. సమ్మెను విరమించి దస్తావేజుల రిజిస్ట్రేషన్లు చేయించాలని జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ఐ విజయరాణి సూచించినా, తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పెన్ డౌన్ కొనసాగిస్తామని లేఖర్ల సంఘం నాయకులు స్పష్టం చేశారు. శుక్ర, శనివారాల్లో రాష్ట్ర నాయకత్వం సమ్మెకు పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దస్తావేజుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు, నెల్లూరు సిటీ అధ్యక్షుడు జేవీబీ అశోక్, నాయకులు పంచాజ్ఞల పవన్‌కుమార్, ములుమూడి సురేష్‌బాబు, ఎండీ జమీరుద్దీన్, పూనం మాలకొండయ్య, ఎండీ మజహరుద్దీన్, కలిశెట్టి మల్లికార్జున, ములుమూడి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెన్‌డౌన్ విరమించాలని దస్తావేజు లేఖర్ల సంఘ నాయకులకు సూచిస్తున్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్ విజయరాణి



సమాచార శాఖ డీడీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పీ వేణుగోపాల్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అదే శాఖలో సత్యసాయి జిల్లా ఏడీగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై డీడీగా నెల్లూరుకు వచ్చారు.



చెట్లకింద భోజనం చేస్తున్న క్రీడాకారులు

ఈ ఎంపికలు ఎవరి కోసం!

- భారత్ బేస్‌బాల్ జట్టుకు నెల్లూరులో ఎంపికలు
- 2 రోజులుగా రహస్యంగా ప్రక్రియ
- గుర్తింపులేని బేస్‌బాల్ సంఘం నిర్వాకం

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భారత ఒలంపిక్ సంఘం, ఇండియన్ బేస్‌బాల్ ఫెడరేషన్, శాయ్, శాప్ ఇలా ఎందులోనూ గుర్తింపు లేకుండా కొన్నేళ్లుగా వివాదాల్లో నడుస్తున్న బేస్‌బాల్ క్రీడా సంఘం పేరుతో జిల్లాలో వ్యాయామ ఉపాధ్యాయుడు చేస్తున్న దందాలు, అక్రమాలు చర్చనీయాంశంగా మారాయి. నవలాకుల గార్డెన్స్‌లో ప్రస్తుతం వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉంటూనే వింజమూరు ప్రాంతంలో అనధికారి ఎంపీఈడీ, బీపీఈడీ కళాశాల నిర్వహిస్తూ గుర్తింపు లేని క్రీడా సంఘాల పేరుతో అనధికార క్రీడా ఎంపికలను నిర్వహిస్తూ లక్షలాది రూపాయలను వసూలున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ టగ్ ఆఫ్ వార్, త్రోబాల్, లెవన్ క్రికెట్‌ల పేరుతో భారత జట్టు ఎంపికలను వింజమూరులోనే నిర్వహించి ఎంతోమంది క్రీడాకారులను మోసం చేసిన ఘటనలు వెలుగు చూస్తున్నాయి. పలు దేశాల్లో ప్రైవేట్ క్లబ్స్ పోటీలకు, ప్రైవేట్ సంస్థలు నిర్వహించే పోటీలకు ఎంపిక చేసిన క్రీడాకారులను తీసుకువెళతూ భారత జట్టుకు ఆడించినట్లు చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, క్రీడాకారులకు మాత్రం ఇవేమీ తెలియకుండా జాగ్రత్తపడుతూ వారి నుంచి రూ.లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఆయా దేశాల్లో పొందిన సర్టిఫికెట్లు ఇక్కడ ఎలాంటి విద్యాప్రవేశాలకు, ఉద్యోగాలకు అర్హత లేవన్న విషయాన్ని వారు దరఖాస్తు చేసుకున్న తరువాత బయటపడిన సంఘటలు వెలుగు చూశాయి. దీంతో బాధిత క్రీడాకారులు కేసులు పెట్టడం, కోర్టులను ఆశ్రయించడంతో పలు కేసులు న్యాయస్థానాల్లో నడుస్తున్నట్లు క్రీడాకారులు తెలిపారు.

● నెల్లూరులో ఎంపికలు...

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళ, బుధవారాల్లో ఎవరికీ తెలియకుండా బేస్‌బాల్ భారతజట్టు ఎంపికలను నిర్వహించారు. చైనాలో జరిగే ఏషియా పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని నమ్మబలుకుతూ పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులకు నెల్లూరులో ఎంపికలు నిర్వహించడం ఆశ్చర్యానికి, అనుమానాలకు తావిస్తోంది. జిల్లా, రాష్ట్రస్థాయి ఎంపికలే అన్నీ అనుమతులు తీసుకుని సందడి వాతావరణంలో నిర్వహిస్తుండగా, భారత జట్టు ఎంపికలు మాత్రం అత్యంత గోప్యంగా నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై డీఎస్‌ఏ అధికారులను ప్రశ్నించగా ఈ ఎంపికలకు తమకు ఎలాంటి సంబంధం లేదని, సాధారణంగా క్రీడల నిర్వహణకు స్టేడియంకు నగదు చెల్లించి మైదానాన్ని రెండు రోజులు లీజ్‌కు తీసుకున్నారని తెలిపారు. దీనిపై సంబంధిత వ్యక్తిని సంప్రదించేందుకు ప్రయత్నించగా తాను ఎవరికీ వివరాలు చెప్పాల్సిన అవసరం లేదని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులే తనకు అండగా ఉన్నారని చెప్పి తప్పించుకోవడం విశేషం. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు ఈ అక్రమాలపై విచారణ జరిపి క్రీడాకారులకు న్యాయం చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు..

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం అండర్-14, 17 బాల, బాలికల రెజ్లింగ్ క్రీడాజట్ల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి హాజరైన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ఆయా విభాగాలకు ఎంపిక చేసినట్లు క్రీడా సమాఖ్య కార్యదర్శులు బీవీ రమణయ్య, డాక్టర్ ఎం దేవిక తెలిపారు. అలాగే, కావలిలోని విశ్వోదయ పాఠశాలలో బాల,బాలికలకు స్విమ్మింగ్ పోటీలు నిర్వహించి జిల్లా జట్టు ఎంపిక చేశామన్నారు. గురువారం కావలిలోని పాత మునిసిపల్ ఉన్నత పాఠశాలలో మాల్‌కంబ్, సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తామని, వీటి విజయవంతానికి పీఈటీలు, పీడీలు చొరవచూపాలని కోరారు.

నాడి పట్టి.. గజ్జె కట్టి..!

నాట్యంలో మెరుస్తున్న యశశ్రీ వీణ

ఒకరు ఇటు చదువు, అటు నాట్యం, చిత్ర లేఖనం, సంగీతంలో రాణించడం అంటే అసాధరణం. కావలికి చెందిన యశశ్రీ వీణ ఈ నాలుగింటిలోనూ ప్రతిభ కనబరుస్తూ అందరినోట ఔరా అనిపించుకుంటోంది.

- సంగీతం, చిత్రలేఖనంలోనూ అద్భుత ప్రతిభ

కావలి (టౌన్), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సివిల్ ఇంజనీర్ అళహరి శ్రీనివాసులు, త్రివేణి దంపతుల కుమార్తె యశశ్రీ వీణ చిత్తూరులోని అపోలో వైద్య కళాశాలలో మెడిసిన్ మూడవ సంవత్సరం చదువుతోంది. డాక్టర్ కావాలనుకున్న కలను నెరవేర్చుకునేందుకు శ్రమిస్తోంది. మరో రెండు సంవత్సరాలలో వైద్యురాలిగా తన ఆశయం పూర్తి చేసుకోనున్న వీణ చిన్ననాటి నుంచి ప్రాణమైన నాట్యం, సంగీతంపై ఏమాత్రం మక్కువ తగ్గకుండా అవకాశం దొరికినప్పుడల్లా నాట్య ప్రదర్శనలు ఇస్తోంది. ఆమె ఆసక్తిని గమనించిన ఆమె తల్లితండ్రులు ప్రముఖ నాట్యాచారిణి జాహ్నవి వద్ద శిక్షణ ఇప్పించారు.

● జాతీయ స్థాయి ప్రదర్శనలు

జాతీయస్థాయిలో దాదాపు 475కుపైగా యశశ్రీవీణ ప్రదర్శనలు ఇచ్చి పలు పురస్కారాలందుకుంది. అఖిల భారతీయ సాంస్కృతిక సంఘం (పూణె) దుబాయ్‌లో 2018లో నిర్వహించిన అంతర్జాతీయ సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న వీణకు తృతీయ స్థానం దక్కింది. అదే ఏడాది పూణెలో జరిగిన జాతీయ స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి, హైదరాబాద్‌లో దూరదర్శన్ వారు 2016లో నిర్వహించిన అందెల రవళి నృత్య పోటీల్లో ప్రథమ స్థానం, హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగిన అంతర్జాతీయ బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రతిభా పురస్కారాలు అందుకుంది. రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ నిర్వహించిన శతరూప సాంస్కృతిక పోటీల్లో జానపద నృత్య ప్రదర్శనతో బహుమతులు, సిలికాన్ ఆంధ్ర నిర్వాహకులు హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళంలో పాల్గొని బహుమతులు సాధించింది.



సీఎం చంద్రబాబు ప్రశంసలందుకుంటున్న వీణ (ఫైల్)



చివరి వరకు గజ్జె ఘల్లుమనాల్సిందే

వైద్యురాలిగా పేదలకు వైద్య సేవలందించడం నా జీవితాశయం. వైద్యవృత్తిలో కొనసాగుతూనే చివరి వరకు గజ్జె ఘల్లుమనాల్సిందే. సంస్కృతి సంప్రదాయాలకు నెలవైన భారతదేశంలో యువత విద్యతోపాటు సంస్కృతిక కార్యక్రమాల వైపు మక్కువ చూపాలి.

\- యశశ్రీ వీణ

- 2017లో రాయలసీమ రంగస్థలి వారు యశశ్రీవీణకు నాట్య రంజిత పురస్కారం అందించారు.
- హైదరాబాదులోని రవీంద్రభారతిలో రాష్ట్రప్రభుత్వ సాంస్కృతిక శాఖ 2018లో నాట్యమయూరి బిరుదు అందజేసింది.
- హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో నాలుగేళ్ల కూచిపూడి సర్టిఫికెట్ కోర్సు చేసి అరుదైన ఘనత సాధించింది. అప్పటి నెల్లూరు కలెక్టర్ ముత్యాలరాజు చేతుల మీదుగా ఉత్తమ నాట్య ప్రతిభా పురస్కారం అందుకుంది.
- రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన యశశ్రీవీణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి ప్రశంసలు అందుకున్నారు. అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ మంత్రులు సోమిరెడ్డి, దేవినేని, ఆనం నారాయణ, పొంగూరు నారాయణ, మండలి బుద్ధప్రసాద్, చిత్తూరు అపోలో వైద్య కళాశాల వీసీ పలువురు ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు.

పెరుగుతున్న హైగ్రేడ్ పొగాకు ధర

కలిగిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో ప్రస్తుతం హైగ్రేడ్ పొగాకు ధర పెరుగుతుండగా లోగ్రేడ్ ధర పతనమవుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాణిజ్య పంట పొగాకుకు గత మూడేళ్లుగా రైతులకు మద్దతు ధర దక్కడంతో ఈ ఏడాది పొగాకు బోర్డు అనుమతించిన దానికంటే రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. 2024-25 పంట కాలంలో రైతులకు అనుమతించిన పొగాకు కొనుగోళ్ల పూర్తయ్యే నాటికి హైగ్రేడ్ పొగాకు గరిష్ట ధర కిలో రూ.280 పలుకగా లోగ్రేడ్ ధర రూ.200 పలికింది. ప్రస్తుతం అనధికారికంగా సాగు చేసిన పొగాకును అపరాధ రుసుముతో కొనుగోలు చేయడం ప్రారంభించిన తరువాత ఒక్కసారిగా హైగ్రేడ్ పొగాకు ధర రూ.280 నుంచి రూ.330కి చేరుకోగా లోగ్రేడ్ పొగాకు ధర రూ.200 నుంచి రూ.100కి పతనమయింది. పొగాకు బోర్డు అనుమతించిన పొగాకు సాగు చేసిన రైతులకు రూ.280 ధర దక్కితే, అనుమతికి మించి సాగుచేసి పండించిన పొగాకు ధర కిలో రూ.330కిపైగా పలుకుతుండటంతో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి ధరల్లో వ్యత్యాసముంటుందన్న అధికారుల మాటలు ప్రస్తుతం నీటి మూటలయ్యాయన్నారు. తమ వద్ద పొగాకు లేని సమయంలో మార్కెట్ ధరలను అమాంతం పెంచేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులవద్ద నాణ్యమైన పొగాకు ఉన్నపుడు తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రస్తుతం అరకొర ఉన్న బేళ్లను కిలో రూ.330కి పైగా కొనుగోలు చేయడంతోపాటు, ఎక్కువ శాతం ఉన్న లోగ్రేడు పొగాకును రూ.100కు కొనుగోలు చేయడం పట్ల పలువురు రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పొగాకు సాగు చేసిన రైతుకు పూర్తిస్థాయిలో మద్దతు ధర అందేలా బోర్డు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కలిగిరి వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

కిలో పొగాకు ధర రూ.341

కలిగిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు మొత్తం 640 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 480 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-3, నోబిడ్-123, ఆర్‌ఆర్-10, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-12 కారణాలతో 160 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.341, కనిష్ఠ ధర రూ.100, సగటు ధర రూ.213.14గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రముఖుల దిగ్ర్భాంతి

నెల్లూరు(క్రైం) : సంగం మండలం పెర మన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడు గురు మృతి చెందడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

- జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆరా తీశారు. ఏడుగురు మృతి చెందడం తీవ్రంగా కలిచి వేసిందని, వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. రహదారులపై నియమాల అమలు తప్పనిసరి చేయాలని అధికారులకు ఆదేశించారు.
- రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.
- జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం ఆవేదనకు గురి చేసిందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. తరచూ జరుగుతున్న ప్రమాదల దృష్ట్యా నాలుగు లేన్ల రోడ్డు ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని జాతీయ రహదారి రీజినల్ అధికారిని కోరారు.
- కారును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు మృత్యువాత పడటం అత్యంత బాధాకమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. బాధితుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు.
- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబసభ్యులకు ప్రగాడ సానుభూతి తెలియజేస్తున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

సాల్ట్ పథకాన్ని రద్దు చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ బ్యాంకు షరతులతో కూడిన సాల్ట్ పథకాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రణభేరి ప్రచార యాత్రలో భాగంగా బుధవారం జిల్లాలోని పొదలకూరు మీదుగా నెల్లూరులోకి ప్రవేశించిన నాయకులు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రభుత్వ బడులను కుదించి ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి రాష్ట్రంలో పాఠశాలలను నడుపుతుండటంతో పేద పిల్లలు విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. ఆ పథకాన్ని రద్దు చేయాలని, ఉద్యోగులకు 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతూనే ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు, ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎంసీ అచ్చయ్య, కోశాధికారి మురళీధర్‌రావు, కార్యదర్శులు ఈ బాలరాగయ్య, నాగిరెడ్డి, ఖాజావలి, సురేంద్రబాబు, మధుసూదన్‌రావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రణభేరి యాత్రకు స్వాగతం పలుకుతున్న యూటీఎఫ్ నాయకులు



జడ్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, సీఈవో తదితరులు



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ కార్తీక్ తదితరులు

దివ్య శిల్పి విశ్వకర్మ

- జయంతి సభలో జేసీ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యావత్ ప్రపంచానికి శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని అందించిన దివ్య శిల్పి విశ్వకర్మ మహర్షి అని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి జేసీ, అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ శిల్పకళా నైపుణ్యం, నిర్మాణ రూపకల్పన, దేవతల కథలు, ఆయుధాల తయారీకి ఆద్యుడిగా విశ్వకర్మ పూజలందుకుంటున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం విశ్వకర్మ పథకం ద్వారా చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం, ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. విశ్వకర్మ జీవిత విశేషాలను బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ వివరించారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది జనాభా కలిగిన విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి తగిన గుర్తింపు లేకుండా పోయిందని, చేతివృత్తుల వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పోలినేని సదాశివయ్య ఆచారి, బుడమగుంట జానకి రామయ్య ఆచారి, తల్లం సురేష్ ఆచారి, వేములూరు రఘురామయ్య, శానంపూడి మహేశ్వరి, నూర్ బాషా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో...

నెల్లూరు(క్రైం): విశ్వకర్మ మహర్షి చిత్రపటానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాస రావు, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఏవో చంద్రమౌళి పాల్గొన్నారు.

● జిల్లా పరిషత్‌లో...

నెల్లూరు (జడ్పీ): జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో మోహనరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 777 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 524 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 253 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 340 కాగా, కనిష్ఠ ధర రూ. 100 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10514
వెండి కిలో ధర	రూ. 131300
వెండి ఒక గ్రాము	రూ. 134.30

తలుపులు తెరుచుకోని ఆరోగ్య కేంద్రం

● రోగులకు అందని వైద్యం

వరికుంటపాడు(ఉదయగిరిరూరల్), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా ఆరంభమైన విలేజ్ హెల్త్ క్లినిక్ వైద్య సేవలు పల్లెల్లో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. వసతుల సంగతి అటుంచితే కనీసం అక్కడి ఉద్యోగులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని అయోమయ పరిస్థితుల్లో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వరికుంటపాడు మండలం కాంచెరువులో కేంద్రానికి మంగళవారం తాళాలు తెరువకపోవడంతో వచ్చిన రోగులు గంటల తరబడి ఎదురుచూసి చేసేదేమిలేక నిరాశగా వెనుదిరగాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ వైద్యసేవలు మాత్రం అందని ద్రాక్షగానే ఊరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కొన్ని రోజులుగా ఇలాంటి పరిస్థితి నెలకొందనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతం కావడంతో ఉన్నతాధికారుల తనిఖీలు ఉండవనే ధీమాతోనే ఉద్యోగులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని పలువురు రోగులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మారుమూల పల్లెల్లో రోగులకు సజావుగా వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తలుపులు తెరుచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్

న్యూస్ బాక్స్

రైతులకు యూరియా పంపిణీ



యూరియా పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ కార్యాలయంలో బుధవారం చైర్మన్ గుర్రం గోపి ఆధ్వర్యంలో యూరియా పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర రాయితీపై రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, తెలుగు యువత అధ్యక్షులు ముజ్జె లక్ష్మినారాయణ, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, సొసైటీ డైరక్టర్ మానం కొండలరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు పొద మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు మంజూరు చేయాలి

ఉదయగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో శిథిలావస్థకు చేరిన మెయిన్ ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని బుధవారం వైఎస్ ఎంపీపీ గుంటుపల్లి మాల కొండయ్యచౌదరి, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్యలు ఎంఈవో-2 టీ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాముల రాజా, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ఉదయగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నేలటూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

●**దుత్తలూరు:** ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని నెల్లూరు భూసార పరీక్షా కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు కన్నయ్య సూచించారు. బుధవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వాడాలని సూచి ంచారు. అలాగే స్థానిక ఆదర్శ పాఠశా లలో సాయిల్ హెల్త్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమ ంలో ఏడీఏ చెన్నారెడ్డి, ఏవోలు మదన్ మోహన్, రామ్మోహన్, ప్రిన్సిపాల్ సైమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గంధ మహోత్సవానికి ప్రముఖుల హాజరు

అనంతసాగరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని మష్కూర్ అలిషా ఖాదరీ దర్గా గంధమహోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు మెట్టుకూరు కృష్ణారెడ్డి హాజరయ్యారు. వారికి స్వామి దర్శనం చేసి ప్రతేక ఫాతేహా నిర్వహించారు. సాని సాహెబ్, మజీద్ సాహెబ్, మీరాన్ ఆధ్వర్యంలో వేడుకలు ముగిశాయి.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం

సీతారామపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా స్వస్థ్‌నారీ సశక్త్ పరిహార్ అభియాన్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి స్వప్న అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యకుమారి, డాక్టర్ నిఖిల్, పిహెచ్‌సి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు గంధ మహోత్సవం

ఏఎస్ పేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా గంధ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. శుక్రవారం సాయంత్రం చిరాగా (దీపారాధన), శనివారం ఉదయం తహలీల్ ఫాతెహాతో గంధమహోత్సవం ముగుస్తుందన్నారు.

పేరు మార్పు

గుంత బజార్, అనంతసాగరం గ్రామం & మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా -524302, నివాసి అయిన అబ్దుల్ రెహమాన్ S/o రహంతుల్లా అను వారు తన పేరును నేటి నుండి **షేక్ అబ్దుల్ రహమాన్ S/o షేక్ రహంతుల్లా**గా పేరు మార్పు చేసుకున్నారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



అనంతసాగరంలో కేక్‌కట్ చేస్తున్న కూటమి నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బుధవారం స్థానిక బీజెపి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలకు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి కరటంపాటి సుధాకర్, ఆత్మకూరు రెడ్‌క్రాస్ చైర్మన్ మహ్మద్ సాదిక్‌హుస్సేన్, చంద్రా వెంకటసుబ్బానాయుడు, పలువురు బిజెపి నేతలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●**అనంతసాగరం :** ప్రధాని నరేంద్రమోడీ జన్మదిన వేడుకలను స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు వల్లూరు రాజేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచారు, స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జగదీష్, మనోజ్‌రెడ్డి, గురవారెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

●**దుత్తలూరు(ఉదయగిరి):** ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి ప్రధానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అయూబ్, బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, చుండి హరిగోపాల్‌రెడ్డి, అందె రామయ్య, పెసల కృష్ణ, సింగవరపు సురేందర్‌రెడ్డి, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోరంలేక సర్వసభ్య సమావేశం వాయిదా

● నేలపై కూర్చొని ఎంపీటీసీ నిరసన



నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ విజయమ్మ, సీపీఎం నాయకులు

ఉదయగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకోమారు జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకాకపోతే అభివృద్ధి ఎలా జరుగుతుందని, సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదా వేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పద్మజ ప్రకటించడంతో సీపీఎం ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్యలు సమావేశ మందిరంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలతో రైతులు అవస్థలు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. సాగు చేసిన సజ్జ పంటకు మద్దతు ధరలేక నష్టాలకు దళారులకు రైతులకు తెగ నమ్ముకుంటున్నారని వాపోయారు. ఉదయగిరి వైద్యశాలలో వైద్యులు లేక, సక్రమంగా వైద్యం అందక పేదలు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దశాబ్దాలుగా అటవీ అనుమతు ల్లేక ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకులు, అధికారులు చొరవ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : ఎంపీడీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఉద్యోగులను ఆరా తీస్తున్న ఎంపీడీవో గోపిశ్రీనివాస్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల పరిధిలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో గోపిశ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విధులకు ఎగనామం.. బోసిపోయిన సచివాలయం కథనానికి స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన కాంచెరువు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధులకు గైర్హాజరైన ఉద్యోగులను ఆరా తీసి సంజాయిషీ కోరారు. ఈ సందర్భంగా సేకరించిన నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కొల్లు వెంకటాద్రి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఏఎస్ పేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న తరగతులలో చేరాడనికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి బుధవారం ప్రకటనలో కోరారు. 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో 4 సీట్లు, 7వ తరగతిలో ఒకటి, 10వ తరగతిలో ఒకటి ఖాళీగా ఉందని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలసి సర్టిఫికెట్లతో విద్యాలయంకు వచ్చి సంప్రదించాలని తెలిపారు.

చిన్నారుల కుటుంబాలకు ఎమ్మెల్యే కాకర్ల ఆర్థికసాయం



చిన్నారి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవంలో ప్రమాదవశాత్తు బాణసంచా పేలి గాయపడిన చిన్నారుల కుటుంబాలకు బుధవారం రాత్రి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి, టీడీపీ నాయకులతో కలిసి గాయాల పాలైన చిన్నారుల నివాసాలకెళ్లి వారిని పరామర్శించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రమాద విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున తొమ్మిది మందికి రూ.18 లక్షలు ఆర్థికసాయం మంజూరు చేశారన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేంతవరకు పూర్తి బాధ్యత నాదే నన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, గడ్డం శ్రీనివాసులు, బొజ్జా శ్రీనివాసులు, శ్రీకుర్తి రవీంద్రబాబు, పాముల రమణయ్య, నల్లిపోగు నరసింహా, తుమ్మల కిరణ్‌బాబు, పాముల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : యూటీఎఫ్



ఉదయగిరిలో రణభేరి జాతా నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఉదయగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి 15 నెలలు కావస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన రణభేరి జాత ఉదయగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుంచి రంగనాయకులస్వామి ఆలయం వరకు మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ బోధనేతర కార్యక్రమాలు, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, 12వ పీఆర్సీ ప్రకటించాలని, నాలుగు డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 25న గుంటూరులో భారీఎత్తున మహా ప్రదర్శన, సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పుడు కూడా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషు, చలపతి శర్మ, నాయకులు తిరుపతయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, నాయబ్ సుబ్బారెడ్డి, భోగ్యం శ్రీనివాసులు, మున్నా, రామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి నీట మునిగిన వరి పంట



గణేశ్వరాపురంలో నీట మునిగిన వరి పంట

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు ఏకతాటిగా ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. వాగులు, వంకల్లోకి నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. విరువూరు సమీపంలోని పిల్లాపేరు వాగులోకి నీరు చేరడంతో జోరుగా ప్రవహిస్తోంది. పలు గ్రామాల్లో మురుగు కాలువలు లేకపోవడంతో నివాసాలు, రహదారుల వెంట నీరు చేరడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. అలాగే గణేశ్వరాపురంలో కోత దశకు చేరుకున్న వరి పంట నీట మునిగి నేల వాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉదయగిరిలో వర్షం

ఉదయగిరి: ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మురుగు కాలువలు పొంగిపొర్లడంతో రహదారులు చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఈ వర్షం పండ్లతోటలకు మేలు చేకూర్చడంతోపాటు రబీ సీజన్ ప్రారంభం కానుండడంతో పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు.

ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

ఉదయగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీని నెల్లూరులోని కార్యాలయంలో ఉదయగిరి అభివృద్ధి ఫోరం ప్రతినిధి షేక్ ఎండీ ఖాజా బుధవారం కలిసి విన్నవించారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే ఈప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు పలువురికి ఉపాధి కల్పించినట్లవుతుందన్నారు. స్పందించిన ఆమె రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం తాను రచించిన రాయలనాటి ఉదయగిరి వైభవం పుస్తకాన్ని ఉషశ్రీకి అందజేశారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని విద్యార్థుల ఆందోళన

ఉదయగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి నోచు కోని ఉదయగిరిని జిల్లా చేయా లని బుధవారం స్థానిక తహసీ ల్దారు కార్యాలయం ఎదుట మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్ర భుత్వ డిగ్రీ కళాశాల విద్యా ర్థులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థు లు మాట్లాడుతూ బంగారం పండే భూ ములున్నా సాగునీటి వసతి లేక పోవడంతో బీళ్లుగా ఉన్నాయన్నారు. ఉపాధిలేక వలస పోతున్నారన్నారు. విద్యా, వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఉదయగిరి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమని, ప్రభుత్వం తమ మొర ఆలకించాలని వేడుకున్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయిస్తాం : ఎస్పీ



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ అజిత

పెరమన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తా మని ఎస్పీ అజిత వేజండ్ల పేర్కొన్నారు. విజయవాడలో ఉన్న ఆమె రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకుని హుటాహుటిన పెరమనకు చేరుకున్నారు. సీఐ వేమారెడ్డి ప్రమాద జరిగిన ఘటనను ఎస్పీకి వివరించారు. అనంతరం ఆత్మకూరు వైద్యశాలకు వెళ్లి మృతదేహాలను పరిశీలించి మృతు ల బంధు వులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన టిప్పర్, డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు చెప్పారు. విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని, అంతేగాక ఇసుక రవాణా అనుమతులపైనా విచారి స్తామని చెప్పారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం నెల్లూరులోని ఎస్2 థియేటర్స్ సమీపంలో జరిగింది. 30 నుంచి 35 ఏళ్ల వ్యక్తి మరణించాడు. మృతదేహంపై లేత కాఫీ రంగు టీషర్టు, బులుగు రంగు షార్ట్ ఉన్నాయి. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ఎవరనే ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు... ఇందుకూరుపేట మండలం రాయుడుపాలెం గ్రామానికి చెందిన జయకృష్ణ(31)కు ఏడేళ్ల కిందట ఆదురుపల్లికి చెందిన లక్ష్మితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. జయకృష్ణ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల దంపతుల నడుమ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. నాలుగురోజుల కిందట లక్ష్మి భర్తపై అలిగి పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. మంగళవారం జయకృష్ణ భార్య వద్దకు వెళ్లి కాపురానికి రమ్మని కోరాడు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కాని అదే రోజు రాత్రి ఆయన నెల్లూరుకు చేరుకుని నవాబుపేట శివాలయం సమీపంలో రోడ్డుపైనున్న ఐరన్‌పోల్‌కు ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. జయకృష్ణ అన్న హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ భోజ్యానాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

దుప్పిని చంపిన స్మగ్లర్ అరెస్ట్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అడవిలో తిరుగుతున్న చుక్కల దుప్పిని వేటాడి చంపిన స్మగ్లర్‌ను నెల్లూరు అటవీశాఖ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల ఎస్‌టీ కాలనీకి చెందిన నంటూరి నాగయ్య మట్టెంపాడు అటవీ ప్రాంతంలో తిరుగుతున్న చుక్కల దుప్పిని చంపి దాని మాంసాన్ని పలు ప్రాంతాల్లో విక్రయించాడు. ఈ సమాచారం తెలుసుకొన్న నెల్లూరు అటవీ రేంజర్ మాల్యాద్రి ఆదేశాల మేరకు సెక్షన్ అధికారి శ్రీనివాసులు, బీట్ అధికారి మనోజ్ కలిసి నాగయ్యను అరెస్ట్ చేశారు. దుప్పి మాంసం, కొమ్ములను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు

సీతారామపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ సచివాలయం సమీపాన గల జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సీతారామపురం నుంచి అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీకి ముగ్గురు వ్యక్తులు ఆటోలో బయలుదేరారు. అయ్యవారిపల్లి జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కోన ప్రభాకర్, సన్నాయి మాలిలకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కోన ప్రభాకర్ ను నెల్లూరుకు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కావలిలో చైన్ స్నాచర్ అరెస్టు

● రెండు సవర్ల బంగారు సరుడు స్వాధీనం

కావలిరూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని బంగారం దుకాణాల సెంటర్‌లో బుధవారం తుపాకుల హను అనే చైన్ స్నాచర్‌ను 1వ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి అతని నుంచి 2 సవర్ల బంగారు సరుడు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. పాతూరుకు చెందిన తాతా భవాని ఈనెల 10వ తేదీ పొదుపు నగదు కట్టేందుకు పాతూరులో నడుచుకుంటూ వస్తుండగా బోగోలు మండలం తిప్పకు చెందిన హను మోటారు బైక్‌పై వచ్చి భవాని మెడలోని బంగారు సరుడు లాక్కుని వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు నిందితుడిని గుర్తించి పట్టుకుని అరెస్ట్ చేసి నట్లు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

ఆత్మకూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన బుధవారం ఆత్మకూరు మండలం నబ్బీనగరం వద్ద చోటు చేసుకుంది. ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వింజమూరు నుంచి ఆత్మకూరుకు బయలుదేరింది. ఆ బస్సులో 120 మంది ప్రయాణికులు ఉన్నారు. ఏఎస్‌పేట మండలం తాతిరెడ్డిపల్లి వద్ద మురళి అనే వ్యక్తి కుటుంబసభ్యులను బస్సు ఎక్కించడానికి ఆపాడు. అప్పటికే బస్సు నిండా ప్రయాణికులు ఉండడంతో డ్రైవరు ఆపకుండా వెళ్లాడు. దీంతో ఆగ్రహించిన మురళీ బస్సును వెంబడించి నబ్బీనగరం వద్ద బస్సును క్రాస్ చేసి తన మోటారుబైకును అడ్డుపెట్టి డ్రైవర్ వెంగళరావుపై దాడిచేశాడు. దీనిపై బస్ డ్రైవర్ వెంగళరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో సివిల్ ఇంజనీర్ మృతి



అబ్బూరి వెంకటరావు (ఫైల్)

ఏఎస్ పేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని హైవే సివిల్ ఇంజనీర్ మృతి చెందిన సంఘటన మంగళవారం నెల్లూరు మెడికవర్ ఆసుపత్రి సమీపంలో చోటు చేసుకుంది. మృతిడి బంధువుల వివరాల మేరకు.. ఏఎస్ పేట మండలం హసనాపురం గ్రామానికి చెందిన అబ్బూరి వెంకటరావు (28) తాటిపర్తి సమీపంలో హైవే పనులలో సివిల్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. పెళ్లికి ముహూర్తాలు పెట్టుకోవాలని ఇటివలే స్వగ్రామమైన హసనపురం వచ్చాడు. నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రిలోని బంధువులను చూసి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బుధవారం పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతదేహన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు చేపట్టారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	147
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	286

కోడిగుడ్ల ధర (100): 560

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

ఉలవపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీవీఈవో బీవీ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. క్వార్టర్లీ పరీక్ష నిర్వహణ, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కళాశాలలో పరిస్థితితులను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకుల సమావేశం నిర్వహించి బోధనాంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఆయన వెంట జిల్లా ఇంటర్మీడియట్ ఏజీఎంవో సుబ్బారెడ్డి ఉన్నారు.



న్యూస్ బాక్స్

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

కావలి(టౌన్), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బుడమగుంట నివాసితుడు సుబ్రహ్మణ్యం వైద్య ఖర్చులకు బ్రాహ్మణ మహాసంఘం నేతలు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం పాతూరులోని చైతన్య జూనియర్ కళాశాల ప్రాంగణంలో బాధితుడి సతీమణికి రూ.12,200 అందజేశారు. సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి టీ.శ్రీనివాసులు, అసోసియేట్ ప్రెసిడెండ్ నందనవనం మధుసూదన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ రాజేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా, పచ్చిరొట్ట విత్తనాలు

కలిగిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు అవసరమైన యూరియా, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి ఎస్‌కే జహీర్ తెలిపారు. బుధవారం మండలంలోని తెల్లపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కలిగిరి, కుడుమలదిన్నెపాడు సొసైటీలలో యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో చిరంజీవి, వీఏఏ జ్యోత్స్న పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన

ఉలవపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులకు, గర్భిణులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉండే ఆహారంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మండలంలోని వీరేపల్లి ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల తల్లులకు వంటల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో మాధవిలత, సూపర్‌వైజర్ కే రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, కళ్యాణి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై...

ఉలవపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై వీరేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు బుధవారం స్థానిక ఎస్సై అంకమ్మ, కందుకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) అనిల్‌కుమార్ అవగాహన సదస్సు నిర్వహించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడుపుట వలన ప్రమాదాలు సంభవిస్తాయని, ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. ముఖ్యంగా మోడల్ స్కూల్ విద్యార్థులు రోడ్డు దాటే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ ప్రాజెక్టు అధికారి అమర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, విద్యాకమిటీ చైర్మన్ ప్రభాకర్, ఎస్‌ఈఎల్ అధికారులు శ్రీనివాసులు, టోల్ ప్లాజా మేనేజర్ నాగేశ్వరరావు, పీఆర్‌వో నరసింగరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు స్టాపర్ల బహూకరణ

కావలి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగపడే విధంగా పోలీస్‌లకు టీడీపీ నాయకులు, మారుతీ షోరూమ్ యజమానులైన గాదం శెట్టి మారతి, సాయిలు రూ.3లక్షలు విలువ చేసే 30 స్టాపర్లను బహూకరించారు. కావలి డీఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్‌కు వాటిని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఒకటో, రెండో పటణ, రూరల్ సీఐలు ఫిరోజ్‌ఖాన్, గిరిబాబు, రాజేశ్వరరావు, టీడీపీ నాయకులు గుత్తికొండ క్రిషోర్, పోతుగంటి శ్రీకాంత్, చవల రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్'

బిట్రగుంట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. బోగోలు అరుంధతీవాడ సచివాలయంలో కోవూరుపల్లి ప్రాథమిక వైద్యులు రామకృష్ణ, జిహారికల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, కావలి డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో బ్రిజిత పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎం.నాగేశ్వరరావు, సీహెచ్.వెంకటేశ్వర్లు, వీ.శ్రీనివాస్‌యాదవ్, ఎన్ఎస్‌యాదవ్, గోవిందరాజులు, సీడీపీవో సౌజన్య, సూపర్‌వైజర్లు హైమావతి, సుప్రజ. తదితరులు పాల్గొన్నారు.

● దగదర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు అఖిల్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత హాజరై మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అలేఖ్య, ఆరోగ్య సిబ్బంది ఎస్‌కొండారెడ్డి, చంద్రశేఖర్, ఆర్‌వీ.జయమ్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో
శక్తివంతమైన దేశంగా భారత్

● ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకల్లో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్


కేక్ కట్ చేస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే ఒక శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ 75వ జన్మదినం సందర్భంగా బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో బుధవారం జలదంకి బస్టాండు కూడలిలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక, సాంకేతిక, వ్యవసాయం, రక్షణ రంగాలలో ప్రధాని చేసిన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. రాష్ట్రం ఎన్డీఏ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి మోదీ సహాయసహకారాలు పుష్కలంగా ఉన్నాయని కొనియాడారు. అనంతరం రక్తదానం చేసిన బీజేపీ నేతలు, యువతను ఎమ్మెల్యే అభినందించి షీల్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా,రాష్ట్ర నాయకులు బ్రహ్మారెడ్డి, తిరుపతిరెడ్డి, కమల, శ్రీనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు మధురెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, జనసేన నాయకులు తోట మురళీ, నిమ్మలపల్లి రామ్‌చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎంతోకాలంగా గ్రామాల్లో పాడిపశువుల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండలంలోని గోపాలమిత్రలు బుధవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. జనసేన నియోజకవర్గ వీవోసీ కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గోపాలమిత్రలు కే.శ్రీనివాసులు, టీ.శ్రీనివాసులు, బీ.ఆనందరావు తదితరులు ఎమ్మెల్యేకు వారి సమస్యలు విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, యువనేత నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ● ముక్తేశ్వరంలో 35 ఎస్సీ కుటుంబాలు టీడీపీలో చేరిక


ముక్తేశ్వరం ఆదిఆంధ్ర కాలనీలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీకి చెందిన దళితులు

లింగసముద్రం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం మండలంలోని మాలకొండరాయుని పాలెం పంచాయతీ పరిధిలోని ముక్తేశ్వరం ఆది ఆంధ్ర కాలనీలోని 35 ఎస్సీ కుటుంబాలకు చెందిన వారు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన గౌడపేరు రత్నం, బాలయ్య, కొండయ్య, ఏసేబు, కోటేశు, డొక్కా ఆదాము, ఆనందరావు, ఎమినేష్, సునీత, నిర్మల, శ్రావణి తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ నాయకులు ఎమ్మెల్యే నాగేశ్వరరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం, నాయకులు మాదవరపు వెంకట్రావు, గోచిపాతల మోషే, పొంకం బ్రహ్మయ్య, ఎం రమణయ్య, సీహెచ్ మాలకొండయ్య, ఎన్ బాలకృష్ణ, కె మనోజ్, ఎన్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

● సొసైటీ అభివృద్ధికి సహకారం

వలేటివారిపాలెం : వలేటివారిపాలెం సొసైటీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెంలో సొసైటీ అధ్యక్షుడు గుత్తా మహేశ్వరరావు ప్రమాణ స్వీకారోత్సవానికి బుధవారం ఎమ్మెల్యే నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వలేటివారిపాలెంను తమ సొంత గ్రామంగా భావించి అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్‌ప్లాంటు అందించేందుకు ముందుకు వచ్చిన గుత్తా వాసుబాబుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం నూతన సొసైటీ అధ్యక్షుడు గుత్తా మహేశ్వరరావును ఎమ్మెల్యే నాగేశ్వరరావు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో టుబాకోబోర్డు ఉపాధ్యక్షుడు గుత్తా వాసుబాబు, టీడీపీ నాయకులు చాల్లా శ్రీనివాసులు, వలేటి నరసింహం, పొన్నగంటి రామయ్య, వైద్యాధికారి శివసిద్ధప్ప, పరిటాల భాస్కర్‌రావు, సాదు శ్రీలత, గుత్తా కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

● సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

● **కందుకూరు:** స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం 30 మంది లబ్ధిదారులకు రూ.16.14 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమిట్ల గురునాథం తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేను కలిసిన దేవళ్ల

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన జనసేన నాయకుడు దేవళ్ల భాస్కరరావు ఎమ్మెల్యే నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జనసేన నాయకులు కొణిదెల శ్రీను, మూలగిరి శ్రీనివాసులు, అయ్యప్ప, ఏ.శ్రీను ఉన్నారు.

● మాలకొండ ఆలయానికి కంప్యూటర్ల బహూకరణ

పవిత్ర పుణ్యక్షేత్రమైన మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి యూనియన్ బ్యాంకు తమ సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా రెండు కంప్యూటర్లు, నగదు కౌంటింగ్ మెషీన్‌ను బహూకరించింది. యూనియన్ బ్యాంకు డీజీఎం రవికుమార్, ఏజీఎం శ్రీనివాస్, సీనియర్ మేనేజర్లు సురేష్‌రెడ్డి, హరికృష్ణ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు చేతులమీదుగా వీటిని ఆలయ అధికారులకు అందించారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి చెన్నకేశవులు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, జిల్లాల్లోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు సభ్యులు వివిధ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అన్నింటిని పరిశీలించి పరిష్కరించాలని ప్రత్యేక అధికారి మండల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, ఏవో శేషారెడ్డి, వైద్యాధికారి శివసిద్ధప్ప, ఎంఈవో మాల్యాద్రిరెడ్డి, ఈవోఆర్డీ నారాయణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయబ్‌ర సూల్, డిప్యూటీ తహసీల్దారు మధుసూధన్‌రావు, సీడీపీవో ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్లు అనూష, ప్రమీల, బీజేపీ నేతలు

కావలి(టౌన్), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం 1వ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాలలో రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనూష, ఆర్ఎంవో ప్రమీల, నేతలు కంచర్ల మురళీకృష్ణ నాయుడు, బ్రహ్మానందం, అమరా సుబ్బారావు, పరుసు వెంకటేశ్వర్లు, బీ మాల్యాద్రి, సీవీసీ సత్యం, మామిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే రెండవ పట్టణ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో వెంగళరావునగర్ గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కందుకూరి సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ మాల్యాద్రి, పొన్నగంటి మురళి, కమల, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ మధుకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషా రెడ్డిలు రక్తదాతలకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్, ఏవో రామకృష్ణ, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, వైఎస్ చైర్మన్ హరినారపరెడ్డి, విట్స్ అధ్యాపకులు డాక్టర్ రజ్వీ, ప్రవీణ్‌కుమార్, మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీకి శ్రీకారం

● కొత్త మిషన్లు ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్


విండ్రో కంపోస్ట్ తయారీ మిషన్లను ప్రారంభిస్తున్న కమిషనర్

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీకి విండ్రో కంపోస్ట్ తయారీ నిమిత్తం నూతనంగా చాపింగ్ మిషన్, సీవింగ్ మిషన్లను గురువారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. కావలి పట్టణం ఉత్తర శివార్లలో ఉన్న కంపోస్ట్ యార్డులో విండ్రో కంపోస్ట్ తయారీకి శ్రీకారం చుట్టినట్లు కమిషనర్ తెలిపారు. ఇక చెత్త నుంచి సంపద తయారీకి చెత్తపై సమరం కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి దానిని కంపోస్ట్ యార్డ్‌కు చేర్చి సంపద తయారీ చేస్తామన్నారు. ఇక కంపోస్ట్ యార్డులలో చెత్త నిల్వలు పేరుకుపోయేదానికి అవకాశం లేదన్నారు. తడి చెత్తను సేంద్రీయ ఎరువుగా తయారు చేసి నర్సరీలు, తోటలు పెంపకం, రైతులకు విక్రయిస్తామన్నారు. పొడి చెత్తను వేరుచేసి ఫ్యాక్టరీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, రమణయ్య, కాటా భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీవో


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్టీవో మురళీధర్

కావలి రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కావలి ఆర్టీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పీ.మురళీధర్ ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తగు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సుదర్‌రావు, అసిస్టెంట్ ఎంవీఐ కరుణాకర్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు అవగాహన

మంచి ప్రదాత చట్టంపై డ్రైవర్లు అవగాహనతో ఉండాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. సుందర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు ఆటో స్టాండ్‌లో మంచి ప్రదాత చట్టం, రహదారి భద్రత నియమాలపై బుధవారం ఆటో డ్రైవర్లకు ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీ బాయ్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌తో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బాలలకు వ్యాక్సిన్ వేయించడం ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని వెంగళరావునగర్ అర్బన్‌హెల్త్‌సెంటర్ డాక్టర్ మహేష్ తెలిపారు. వెంగళరావునగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్, విశ్వోదయ సహకారంతో పట్టణంలోని బుడంగుంట ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలలకు వ్యాక్సినేషన్, ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం డాక్టర్ రామ్‌సెంటర్ వారు గర్భిణులకు ఐరన్, పోలిక్, కాల్షియం సిరప్‌లు, బాలలకు మల్టీవిటమిన్ల సిరప్‌లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ బాధ్యులు మనోహర్‌రెడ్డి, కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ఆరోగ్యకేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాతలకు సబ్‌కలెక్టరు, డీఎస్పీ అభినందన



రక్తదాతకు నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టరు హిమవంశీ, డీఎస్పీ, తదితరులు

కందుకూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంత రక్తదాతల సమూహం 9వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించిన కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీ, డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యంలు రక్తదాతలను అభినందించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అరుదైన ఏ బీ నెగెటివ్ గ్రూప్ రక్తదాత నత్తా భానుకిరణ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కందుకూరు సీఐ అన్వర్ బాషా, సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు, సక్షమ్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, అధికసంఖ్యలో రక్తదాతలు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థుల రక్తదానం

స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన రక్తదాన్ అమృత్ మహోత్సవ్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఈ రక్తదానశిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పీ.ఏడుకొండలు, వైస్‌ప్రిన్సిపాల్ హరిబాబు, ఏరియా హాస్పిటల్ వైద్యుడు డాక్టరు పీ.విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో...

రక్తదాన్ అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కందుకూరు ఏరియా హాస్పటల్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదానశిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ ఆధ్వర్యంలో 25మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అధ్యాపకులకు ఏరియా ఆసుపత్రి డాక్టరు హరిచందన కృతజ్ఞతలు తెలిపారు.

ముర్రుపాలు బిడ్డకు అమృతం : సీడీపీవో

వలేటివారిపాలెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానమని కందుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఉషారాణి తెలిపారు. మండలంలోని అత్తింటివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ మహ కార్యక్రమం జరిగింది. అనంతరం తల్లులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునీత, రబీనా పాల్గొన్నారు.

మండలంలో చిరుజల్లులు

కొండాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బుధవారం చిరుజల్లులతో వర్షం కురిసింది. కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండల కారణంగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మద్యం సేవించి దూషిస్తున్నారని ప్రశ్నిస్తే మాపైనే కేసులా?

● పోలీసులపై దగదర్తి కొత్త దళితవాడ వాసుల ఆవేదన

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల కేంద్రంలో ఉన్న కొత్త దళితవాడకు ఎదురుగా ఉన్న బీమాస్ దాబా హోటల్ వద్ద మద్యం సేవించి అటువైపు రాక పోకలు సాగిస్తున్న మాపై కొందరు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని దాబా హోటల్ వారిని ప్రశ్నించినందుకు మాపైనే కేసులు పెట్టారని దళితవాడ వాసులు ఆరోపించారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో భీమ్‌భారత్ సైనిక్స్ అధ్యక్షుడు పోలవరపు కార్తికేయ, దళితనేతలు జువ్విగుంట లక్ష్మణరావు, మోడి సుజాతలు మాట్లాడారు. దాబా హోటల్‌లో మద్యం సేవించిన వారు కులం పేరుతో దూషిస్తున్నారని, దాబా నిర్వహకుడు వడ్డే వినయ్, కడియాల సురేష్‌ను అడిగేందుకు వెళ్లగా వారు తమపైకి దౌర్జన్యానికి వచ్చారని దగదర్తి పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టారన్నారు. తమను కులం పేరుతో దూషిస్తున్నారని తాము పోలీస్‌లకు చేసిన ఫిర్యాదును పోలీస్‌లు పట్టించుకోకుండా తమపైనే చదువుకునే యువకులతో సహా కేసులు పెట్టి ఎస్ఐ జంపాని కుమార్ వేధిస్తున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీని కలవగా ఆయన కావలి డిఎస్పీకి సమస్యను పరిస్కరించాలని చెప్పారన్నారు. అయితే డీఎస్పీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దళితులకు న్యాయం చేయకపోతే తాము ఆందోళన చేయాల్సి వస్తోందని చెప్పారు.


రక్తదాన అమృత్ మహోత్సవాలను జయప్రదం చేయండి

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రక్తదాన అమృత్ మహోత్సవాలను జయప్రదం చేయాలని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో రక్తదాన అమృత్ మహోత్సవాలను ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినంను పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి మహాత్మాగాంధీ జయంతి అక్టోబరు 2 వరకు రక్తదాన అమృత్‌మహోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా టీ షర్ట్‌లనుఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ. రవిప్రకాష్, కే. హరినారపరెడ్డి, డాక్టర్ పాములూరు శ్రీధర్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసన్నకుమార్, గాదిరెడ్డి హరనాథ్, బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక

జలదంకి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 17 ఏళ్ల లోపు మండలస్థాయి క్రీడాకారుల ఎంపికకు బాలబాలికలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. వాలీబాల్, షాట్‌పుట్, చెస్ తదితర క్రీడలను హైస్కూల్ పీడీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని మండలస్థాయి క్రీడాకారులుగా ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలను ఎంఈవోలు పద్మనాభరావు, నాగేశ్వరరావుల పర్యవేక్షించారు.

బీజేపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

బిట్రగుంట, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): బోగోలు మండలంలో ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బోగోలులోని విజయగణపతి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వ హించారు. ప్రాథమిక పాఠశాలో విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ముంగమూరు జాతీయ రహదారి వద్ద ఉన్న భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీలో పండ్లు, రొట్టెలు, పౌష్టికా హారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, నేతలు జీ.వెంకటేశ్వర్లు, గోపీకృష్ణయాదవ్, టీ.బాలసుబ్రహ్మణ్యం, గోవిందరాజులు, వెంకటరమణయ్య, సురేష్ పాల్గొన్నారు.

కొద్ది పాటి వర్షానికే రోడ్డెక్కిన వర్షపు నీరు

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పూడికతో మూసుకు పోతున్న కాలువలు, తూములు, ఆక్రమణలతో కుదించుకుపోతున్న రోడ్ల కారణంగా కొద్దిపాటి వర్షం పడినా కావలిలో వర్షపునీటితో పాటు డ్రైనేజీ నీరు రోడ్డెక్కి పారుతోంది. పట్టణంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన కొద్ది పాటి వర్షానికే అనేక చోట్ల రోడ్లపైకి వర్షపు నీరు చేరింది. వెంగళరావునగర్‌లో రెండో పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో కావలి-దుత్తలూరు హైవే రోడ్డుపై వర్షపునీరు నిలిచి చెరువును తలపించింది. కాలువ పూర్తిగా పూడి పోవడం, రోడ్డు మార్జిన్ ఆక్రమణలకు గురికావడంతో నీరు పోయే మార్గంలేక రోడ్డుపైనే నిలిచింది.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి


ఆర్డీవోకి వినతిపత్రం ఇస్తున్న బుడంగుంట దళితులు

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడంగుంట దళితకాలనీలో అక్రమంగా తొలగించిన విద్యుత్‌ను వెంటనే పునుద్ధరించాలని దళితులు బుధవారం కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణకు విన్నవించారు. వారు మాట్లాడుతూ దళితులమనే భావంతో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సిబ్బంది మూకుమ్మడిగా వచ్చి ఇళ్లలోని మీటర్లను స్తంభాలకు ఉన్న సర్వీస్ వైర్లను తొలగించి కాలనీ వాసులను అంధకారంలో ఉంచటంపై మానవహక్కులు, ఎస్సీ ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఉచిత విద్యుత్ బిల్లుల యూనిట్లపై అవగాహన కల్పించకుండా బిల్లులు పేరుకుపోయే వరకు పట్టించుకోకుండా వేలకు వేలు బిల్లులు పెరిగిన తర్వాత ఒక్కసారి కట్టమంటే ఎలా సాధ్యపడుతోందన్నారు. వాయిదాల పద్ధతిలో బిల్లులు చెల్లించుకునే విధంగా అవకాశం కల్పించి తొలగించిన విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకుడు కరువది భాస్కర్, దళితనేతలు అశోక్, లోకేష్, సాల్మన్, శివ, గణేష్, మనోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంలో మెలకువలు పాటించాలి

అల్లూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : చేపల పెంపకంలో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించి ఆదాయాన్ని గడించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీహరి సాదు, డాక్టర్ ఎస్.లోకేష్‌లు అన్నారు. బుధవారం అల్లూరులోని పలు ప్రాంతాల్లో చేపల చెరువులను పరిశీలించారు. అనంతరం వరిసాగు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



'సూర్యప్రభ' ట్రయల్‌రన్

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వినియోగించే సూర్యప్రభ వాహనం పటిష్టతను పరిశీలించేందుకు బుధవారం టీటీడీ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. అధిక బరువుతో కూడిన ఈ వాహనాన్ని ఆలయం ముందు ఊరేగించి.. పరిశీలించారు. వాహన బేరర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులు గమనించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

'తిరుచానూరు' స్టేషనుకొచ్చిన ట్రైన్

తిరుచానూరు రైల్వే స్టేషనుకు తొలి రైలు వచ్చింది. హరత్ నాందేడ్-తిరుపతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఉదయం 11.40 గంటలకు రావాల్సి ఉండగా, మూడు గంటల ఆలస్యంగా మధ్యాహ్నం 3.18 గంటలకు చేరుకుంది. ఈ కొత్త స్టేషన్‌లో దిగే ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించడానికి తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ ముందుగానే వచ్చారు. ప్రత్యేక రైలు సమాచారం తెలుసుకున్న కొందరు ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకున్నారు. వారికి విశ్రాంతి గదుల్లో వసతులు కల్పించి.. ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. సాధారణ ప్రయాణికుల కోసం టికెట్ బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు.

కొసమెరుపు: ఈ ప్రత్యేక రైలులో 170 మంది ప్రయాణికులు ప్రయాణించగా, అందరూ రేణిగుంట రైల్వే జంక్షన్‌లో దిగారు. టీటీఇలు మాత్రం తిరుచానూరు వరకు వచ్చారు. ఈ ప్రత్యేక రైలు 6.40 గంటలకు తిరిగి బయలు దేరింది. రేణిగుంట జంక్షన్ పేరు పాతది కావడంతో అందరూ అక్కడే దిగారని అధికారులు తెలిపారు. తిరిగి అక్కడే ఎక్కుతారన్నారు. - తిరుపతి(సెంట్రల్), ఆంధ్రజ్యోతి



మెప్మా.. ఇదేంటి చెప్మా..!

● ఆర్పీల అంతులేని అవినీతి

● వెలుగులోకి వచ్చిన నలుగురిపై చర్యలు ● మిగిలిన వారి మాటేమిటో?

● బైరాగపట్టెడలో ఓ మహిళా సమాఖ్య ఉంది. దాని నిర్వహణ మొత్తం మహిళా ఆర్పీ భర్త చూస్తారు. ఆ సమాఖ్యపై పలు ఆరోపణలు వచ్చాయి. మహిళా సభ్యులకు రాత్రి 10 గంటల సమయంలో ఫోన్లు చేసి ఇప్పుడే లెక్కలు చూసేందుకు రావాలని ఒత్తిడి చేశారన్న ఫిర్యాదులు మెప్మా అధికారులకు వెళ్లాయి. వాళ్లేమో చూసీచూడనట్టు వదిలేశారు.రుణాల మంజూరులోనూ పక్షపాతం చూపుతారన్న విమర్శలున్నాయి. కొందరు అధికారులకు వాటాలు వెళ్లడం వల్లే ఇలాంటి ఫిర్యాదులను పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి.



బైరాగపట్టెడలోని ఆర్పీ భర్త నిర్వహిస్తున్న ఓ మహిళా సమాఖ్య

● లక్ష్మీపురంలో ఓ మహిళా ఆర్పీ వైసీపీ హయాంలో చెలరేగిపోయారు. సభ్యుల నగదును బ్యాంకులో జమ చేయకుండా ఫేక్ రసీదులు చూపించారు. కూటమి ప్రభుత్వం రాగానే ఈ వ్యవహారం బయటకు వచ్చింది. దాదాపు రూ.కోటి చుట్టేసిన ఆమెను బుజ్జగించి ప్రామిసరీ నోట్ రాయించుకుని వదిలిపెట్టేశారు. ఏడాదవుతున్నా ఆమె ఆ మొత్తాన్ని తిరిగివ్వలేదు.

తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ)లో అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కొంతమంది రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) అక్రమంగా డ్వాక్రా సంఘాలు, పొదుపు గ్రూపుల ద్వారా నిధులను స్వాహా చేసినట్టు అధికారులు గుర్తించారు. ఈక్రమంలో నలుగురు ఆర్పీలను తప్పించారు. దీపికా సమాఖ్య ఆర్పీ నౌహీరా రూ93లక్షలు, తెలుగుతల్లి సమాఖ్య ఆర్పీ హేమలత రూ22లక్షలు, బాలాజీ సమాఖ్య ఆర్పీ భారతి 27.57లక్షలు స్వాహా చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులు నమోదయ్యాయి. లక్ష్మీపురానికి చెందిన మరో ఆర్పీ లత రూ.90 లక్షలు స్వాహా చేశారని ఏడాది క్రితం నిర్ధారించి తాత్కాలికంగా తప్పించారు. నగదు తిరిగి చెల్లించేలా ప్రామిసరీ నోటు రాయించుకున్నారు. అయితే ఇప్పటివరకు చెల్లించకపోవడంతో ఆమెపైనా కేసు నమోదు చేయించామని మెప్మా అధికారి కృష్ణవేణి తెలిపారు.

జీతం కన్నా గీతం ఎక్కువ

ఆర్పీల నెల వేతనం రూ.8వేలు. రుణాల మంజూరుకు సభ్యుల నుంచి వసూలు చేయడమే ఎక్కువన్న విమర్శలున్నాయి. కొందరైతే నకిలీ గ్రూపులను సృష్టించి లక్షలాది రూపాయల రుణాలను మింగేస్తున్నారు. అవినీతి ఆర్పీలకు అండగా ఉంటూ వారికి పొదుపు సభ్యుల ఆధార్ కార్డులను మెప్మా కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కార్యాలయంలోని కొందరు సీవోలు తమ వంతుగా సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

అనర్హులే ఆర్పీలు : తిరుపతిలో 155 మంది ఆర్పీలు ఉన్నారు. 5 వేల డ్వాక్రా సంఘాలు అధికారికంగా ఉన్నప్పటికీ సుమారు 4,600 సంఘాలు 162 సమాఖ్యలు మాత్రమే క్రియాశీలకంగా ఉన్నాయి. చాలావరకు అనర్హులు ఉన్నారన్న విమర్శలున్నాయి.

బోగస్ దందా

నకిలీ రసీదులతో బ్యాంకులనుంచి నగదు డ్రా చేయడం, నకిలీ గ్రూపులు సృష్టించి అవినీతికి పాల్పడిన ఘటనలు పొదుపు సంఘాలను కుదిపేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బోగస్ గ్రూపులతో రూ.కోట్ల అవినీతి జరిగినట్టు స్పష్టమవుతోంది. మెప్మాలోని కొందరు అధికారుల అండతో ఆర్పీలు రుణ దందాను ఇంకా కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పనిలో పనిగా పొదుపు గ్రూపుల నుంచి దర్జాగా మామూళ్లు వసూలు చేస్తున్నారని సభ్యులు చెబుతున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా బ్యాంకులను బురిడీ కొట్టించడంలో కొందరు ఆర్పీలు కీలకంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. అలాంటి వారిపై చర్యలు లేకపోవడంతో మళ్లీ బోగస్ దందాకు తెరలేపారు.

ఆర్పీగా ఉండేవారు స్వయం సహాయక సంఘ మహిళా సభ్యురాలై ఉండాలి. అంతేకాకుండా నిరుపేద కుటుంబానికి చెంది, స్థానిక నివాసిగా ఉండాలి. 18 నుంచి 40ఏళ్ల వయస్సు కలిగి చురుగ్గా ఉండాలి. స్లమ్ లెవల్ ఫెడరేషన్‌కు కనీస 10వతరగతి, టౌన్ లెవెల్ ఫెడరేషన్‌కు ఇంటర్ విద్యార్హత తప్పనిసరి. సంఘాలలో మూడు నుంచి ఐదేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి. వీరు సంఘంలోని పేద కుటుంబాల కోసం పనిచేయగలిగి, సభ్యుల ఆర్థికాభివృద్ధికి సమావేశాలు నిర్వహించి శిక్షణ ఇవ్వాల్సి ఉంది. సమర్థవంతగా ఉంటూ, ఆదర్శవంతమైన సభ్యురాలిగా ఉంటేనే ఆర్పీలుగా ఎంపికయ్యే అవకాశం ఉంది. ప్రత్యేకించి నిజాయితీ, సహనం, నిబద్ధత, సేవాతత్వం కలిగి, అన్నీ సంఘాల సభ్యుల ఆమోదం పొందిన వారై ఉండాలి. వాటితోపాటు మొబైల్, కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. నెలలో కనీసం 25 రోజులు సంఘ సమావేశాలు నిర్వహించి అందుకు సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేసినప్పుడే వారికి నెలకు రూ.8వేలు వేతనంగా చెల్లిస్తారు. అయితే తిరుపతిలో చాలావరకు ఈ నిబంధనలేవీ పాటించడంలేదని స్పష్టమవుతోంది. కొందరు పురుషులు కూడా సమాఖ్యలు నిర్వహిస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి సమాఖ్యను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఆడిట్ చేయడంతో అవినీతికి చెక్ పెట్టవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఆడిట్ ప్రక్రియ మొదలైంది.

నేడు అమరావతికి డీఎస్సీ అభ్యర్థులు

సీఎం నుంచి రేపు నియామక పత్రాలు అందుకోనున్న 1,408 మంది

తిరుపతి(విద్య), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీఎస్సీకి ఎంపికైన 1,408 మంది అభ్యర్థులు గురువారం అమరావతికి బయలుదేరనున్నారు. వీరికి సచివాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబు నియామక పత్రాలను అఅందజేయనున్నారు. అభ్యర్థులకు సహాయంగా మరొకరిని తీసుకొచ్చేందుకు అనుమతించారు. ఇలా మొత్తం 2,456 మందిని అమరావతికి తీసుకెళ్లేందుకు 86 బస్సులను విద్యాశాఖ సిద్ధం చేశారు. వీరందరికీ ఉచిత ప్రయాణం, వసతి, భోజన వసతులను కల్పిస్తున్నారు. అమరావతికి వెళ్లే డీఎస్సీ అభ్యర్థులు, వారి సహాయకులు తిరుపతి- రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఉదయం 7 గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత వీరందరికీ పాస్‌లు జారీ చేస్తారు. అనంతరం బస్సులు బయలుదేరతాయి. రాత్రికి ఒంగోలులో బస చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం తర్వాత ఒంగోలు నుంచి బయలుదేరి 3 గంటలకు సచివాలయానికి చేరుకోనున్నారు. అక్కడ నిర్వహించే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేస్తారు. అభ్యర్థులు, వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తీసుకెళ్లి.. తిరుపతికి తీసుకొచ్చేందుకు 344 మంది అధికారులను నియమించినట్లు తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఒక్కో బస్సు పర్యవేక్షణకుగాను ప్రధానోపాధ్యాయుడు, ఒక ఉపాధ్యాయుడు, ఇద్దరు పీఈటీల చొప్పున 344 మంది పర్యవేక్షణ విధులు నిర్వహించనున్నారు.



సచివాలయం నుంచి బడికి

పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం సచివాలయంలో నల్లా శంకర్(44) ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. ఈసారి ఎలాగైనా డీఎస్సీలో ప్రతిభ చాటుకుని టీచర్‌గా ఎంపిక కావాలనుకున్నారు. రేయింబవళ్లు శ్రమించి ఎంపికయ్యారు. సోషల్ టీచర్‌గా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని శంకర్ తెలిపారు.

భర్తతో పాటు తానూ టీచరు కావాలని..



భర్త ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అర్హురాలైన తానూ ఉపాధ్యాయురాలిగా పనిచేయాలని పుత్తూరుకు చెందిన గాయత్రి భావించారు. ఈక్రమంలో వెలువడిన డీఎస్సీ నోటిఫికేషన్ ఆమెలో ఉత్సాహాన్ని నింపింది. ఓపక్క ఇంటిపని చేసుకుంటా రాత్రి పూట పరీక్షకు సన్నద్ధమయ్యారు. ఆమె శ్రమ ఫలించింది. ఇంగ్లీషు ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ప్రత్యేకంగా కోచింగ్ తీసుకోకుండా పరీక్ష రాశానని గాయత్రి తెలిపారు.

- పుత్తూరు, ఆంధ్రజ్యోతి

30 రోజులు.. 28.41లక్షల మంది

● స్త్రీశక్తిలో లబ్ధి పొందిన మహిళలు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకానికి విశేష ఆదరణ లభించింది. ఆగస్టు 15 నుంచి 30రోజుల్లో 28.41లక్షల మంది ఉచిత ప్రయాణ సౌకర్యం సద్వినియోగం చేసుకున్నారు.ఈ టికెట్ల విలువ రూ.11.35కోట్లు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీ ఖాతాలో జమ చేయనుంది. తొలి రోజు నుంచి క్రమేణా పెరుగుతూ చివరి దినానికి 12శాతం మహిళా ప్రయాణికులు గతేడాది కంటే పెరిగారు. రోజువారీగా రాబడిలో సరాసరి రూ. పాతిక లక్షలు తగ్గుముఖం పట్టినా గతంలో కంటే పెద్దగా తేడా కనిపించడంలేదని ఆర్టీసీ అధికారులు అంటున్నారు.

మహిళల ఆరోగ్యంతోనే బలమైన కుటుంబం

● స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌పై అవగాహన ప్రారంభం

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన మహిళలతోనే బలమైన కుటుంబ నినాదంతో ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. నరసింహతీర్థం వీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్(మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు) కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి ఆయన పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య భద్రత కోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల పరిధిలో 536 వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మహిళలు, కిశోర బాలికల ఆరోగ్యానికి సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులను అందించనున్నట్లు తెలిపారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళలు ఇంటి బాధ్యతలతోపాటు విద్య, ఉద్యోగం, వ్యాపారం వంటి అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నందున వారి ఆరోగ్యాన్ని కాపాడటం ఎంతో ముఖ్యమన్నారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ ఇటువంటి కార్యక్రమాలతో మహిళల ఆరోగ్యానికి చేకూరే ప్రయోజనాలను వివరించారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, కార్పొరేటర్లు సీకే రేవతి, కల్పన, బీజేపీ నేతలు సుచరిత, అజయ్, వైద్యాధికారులు కృష్ణకుమారి, హేమలత, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సదరన్ డిస్కంలో పదోన్నతులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కంలో కొంత కాలంగా కోర్టులో ఉన్న పదోన్నతుల సమస్యలు తీరాయి. దీంతో బుధవారం పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న జీఎం మురళీకుమార్, తిరుపతి ఎస్ఈ పి.సురేంద్రనాయుడు, నెల్లూరు ఎస్ఈ ఉమాపతికి సీజీఎంలుగాను, ఈఈలుగా ఉన్న 9 మందిలో తిరుపతి టౌన్‌ఈఈ వి.చంద్రశేఖర్ రావు, ఆర్‌ఏసీ విభాగంలో ఉన్న రాజశేఖర్ రెడ్డి, కొనుగోలు విభాగంలో వున్న సుబ్బారావుతోపాటు పలు జిల్లాల్లో ఉన్న ఆరుగురికి ఎస్ఈలుగా, అలాగే 13 మంది డీఈఈలకు ఈఈలుగా పదోన్నతులు కల్పిస్తూ సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు.



మురళీకుమార్ - సురేంద్రనాయుడు

గవర్నర్‌కు బ్రహ్మోత్సవాల ఆహ్వానం



తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలంటూ టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి బుధవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన విజయవాడలో రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గంజాయి కనిపించకూడదు

● పటిష్ఠ ప్రణాళికతో ఎస్పీ చర్యలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి అనేదే కనిపించకూడదు. ఇదీ రెండు రోజుల కిందట ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సుబ్బరాయుడి ప్రాధాన్యం. ఈ దిశగా పటిష్ఠ ప్రణాళికను సిద్ధం చేసి.. అమలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. గంజాయి విక్రయాలు, వినియోగం, రవాణాపై గట్టి నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని సబ్ డివిజన్ల పరిధిలోని గంజాయి మూలాలపై ఆరా తీశారు. గంజాయిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. గతంలో అరెస్టయి.. బెయిల్‌పై బయటకు వచ్చి ఇదే వ్యాపారం చేస్తున్న వారి కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. గత రెండేళ్ల వ్యవధిలో జిల్లాలో 500కు పైగా కేసులు నమోదు చేసి 2340 కిలోల గంజాయిని సీజ్ చేశారు. అయినా, రోజూ ఎక్కడో ఒక చోట గంజాయి అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటి వరకు గంజాయి కేసుల్లో పోలీసు రికార్డులకెక్కిన వారి జాబితాను బయటకు తీసి, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేసే యోచనలో ఉన్నారు. గంజాయిరహిత జిల్లాగా మార్చే యోచనలో ఎస్పీ సుబ్బరాయుడు పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. గంజాయి మూలాలు, దిగుమతి అవుతున్న మార్గాల్లో నిఘా పెట్టి పది రోజుల్లో పూర్తిగా గంజాయిని పట్టుకోవాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్లలో ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఆ తర్వాత గంజాయి అనేది జిల్లాకు రాకూడదని సబ్ డివిజన్ల వారీగా ప్రత్యేక బృందాలకు ఎస్పీ స్పష్టంచేశారు.



వాసంశెట్టి శుభాష్



రవళి, ఆర్కే రోజా



జ్యోతి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మంత్రి వాసంశెట్టి శుభాష్, మాజీ మంత్రి ఆర్కే. రోజా, సినీ నటులు రవళి, జ్యోతి ఉన్నారు.

త్వరలో 'వాయుపుత్ర'

● దర్శకుడు చందూ మొండేటి వెల్లడి

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): సితార బ్యానర్‌లో త్వరలో 'వాయుపుత్ర' అనే కొత్త సినిమా షూటింగ్ మొదలవుతుందని దర్శకుడు చందూ మొండేటి వెల్లడించారు. కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని బుధవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రతి సినిమాకు విడుదల ముందు, తర్వాత తిరుమలకు వస్తుంటామన్నారు. 'కార్తికేయ-2' ఓపెనింగ్ కూడా ఇక్కడే జరిగిందన్నారు. అలాగే 'తండేల్' విజయం తర్వాత కూడా చిత్ర బృందంతో వచ్చి స్వామిని దర్శించుకున్నట్టు చెప్పారు.



సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.87 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,607

తలనీలాలు సమర్పించినవారు: 23,856



ఆండవన్ ఆశ్రమాధిపతికి టీటీడీ పెద్ద మర్యాద



తిరుమల, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగం శ్రీమద్ ఆండవన్ ఆశ్రమాధిపతి వరాహమహాదేశికన్ టీటీడీ పెద్ద మర్యాదతో బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్ద టీటీడీ అధికారులు, అర్చక బృందం పల్లకీలో తీసుకెళ్లిన శఠగోపాన్ని వారికి సమర్పించారు. అక్కడ నుంచి మంగళవాయిద్యాల నడుమ మహాద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లి మూలవిరాట్టును దర్శించుకున్నారు.

ఆ మృతుల వెనుక ఆర్థిక వివాదాలు?

● సెల్‌ఫోన్ డాటా విశ్లేషణ, పోస్టుమార్టం నివేదికలే కీలకం



ఆనవాళ్లు సేకరిస్తున్న సీఐ సుదర్శన ప్రసాద్

పాకాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాకాలవారిపల్లె సమీపంలోని బయటపడిన మృతదేహాల కేసులో ఆర్థికాంశం కీలకంగా మారింది. ఆదివారం రెండు మృతదేహాలు, తర్వాత గోతుల్లో మరో ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా కనిపించిన విషయం తెలిసిందే. మృతులది తమిళనాడుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. తమిళనాడు పోలీసులతో వెంకటేష్ అనే వ్యక్తి వచ్చి మృతురాలు జయమాలను తన భార్యగా, దర్శిని, వర్షిణిలను కుమార్తెలుగా గుర్తించారు. మృతుడు కళైసెల్వన్ దగ్గర బంధువని పోలీసులకు చెప్పాడు. కాగా కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య ఆర్థిక విషయంలో గొడవలున్నట్లు తెలిసింది. కువైట్ నుంచి తిరిగి వచ్చిన వెంకటేష్ బంధువు కళైసెల్వన్‌పై చీటింగ్ కేసు పెట్టినట్లు సమాచారం. ఈక్రమంలో జూలైలో భార్యాపిల్లలు కనిపించడంలేదని తిట్టచ్చేరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశాడు. మృతదేహాల వివరాలు తెలిసినా జయమాల కుటుంబసభ్యులెవరూ సంఘటనా స్థలానికి రాలేదు. కళైసెల్వన్‌కు చెందిన వారు కూడా రాలేదు. జయమాల భర్త, మామ, బావలు మాత్రమే తమిళనాడు పోలీసులతో వచ్చారు. మృతదేహాల వద్ద రెండు సెల్‌ఫోన్లు దొరికాయి. చిన్నపాప మృతదేహం తలపై గాయాలున్నాయి. పోస్టుమార్టం రిపోర్టు, సెల్‌ఫోన్ల విశ్లేషణ వివరాలు వస్తే హత్యా లేదా ఆత్మహత్య అనేది తెలిసే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.

సుబ్రమణ్యంనాయుడికి కన్నీటి వీడ్కోలు

● అంతిమయాత్రలో పాడె మోసిన ఎమ్మెల్యే నాని



సుబ్రమణ్యంనాయుడి అంతిమయాత్రకు తరలివచ్చిన జనం



పాడె మోస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం గడ్డంవారిపల్లెలో బుధవారం డీసీఎంస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడికి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. శోకతప్త హృదయాలతో నివాళులర్పించారు. మధ్యాహ్నం జరిగిన అంతిమయాత్రలో ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయంగా పాడె మోశారు. ఎమ్మెల్యే సతీమణి సుధారెడ్డి, కుమారుడు పులివర్తి వినీల్ దివంగత నేత కుటుంబ సభ్యులను ఓదారుస్తూ అండగా నిలిచారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు చంద్రప్రకాష్‌నాయుడు, మబ్బు దేవనారాయణరెడ్డి, జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు చేరుకుని సుబ్రమణ్యంనాయుడి పార్థివదేహానికి పూలమాలలు వేశారు. మధ్యాహ్నం ఆయన పార్థివదేహంపై టీడీపీ జెండాను కప్పారు. తర్వాత అంతిమయాత్ర సాగింది.. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పార్టీకి నిబద్ధతతో సేవలందించిన సుబ్రహ్మణ్యంనాయుడి మృతి పార్టీకి, తనకు తీరని లోటు అన్నారు. వైసీపీ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నివాళులు అర్పించిన వారిలో వైసీపీ నేతలు మల్లం చంద్రమౌళి రెడ్డి, షేక్ మస్తాన్, బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, పాకాల చరణ్ రెడ్డి, అగరాల భాస్కర్ రెడ్డిలు ఉన్నారు.

మామండూరు బాధితులకు ఊరట

● 22ఏ నుంచి విముక్తి కల్పించిన ప్రభుత్వం

● చొరవ తీసుకున్న తుడా చైర్మన్



తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌ను సత్కరిస్తున్న మామండూరు బాధితులు

తిరుపతి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మామండూరు తుడా లేఅవుట్ బాధితులకు శుభవార్త. రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత వైసీపీ ప్రభుత్వంలో చంద్రగిరి మండలం మామండూరులో సుమారు పన్నెండెకరాల్లో 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్' పేరిట 139 ప్లాట్లతో తుడా ఎంఐజీ లేఅవుట్ వేసింది. అప్పటికి ఈభూములు 22ఏ (నిషేధిత జాబితా)లో ఉన్న విషయం దాచిపెట్టింది. ప్లాట్లు విక్రయించేసింది. తర్వాత రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో కొనుగోలుదారులు అవాక్కయ్యారు. అంతేకాదు లేఔట్ స్థలానికి మ్యాపింగ్‌కి మధ్య వ్యత్యాసం ఉండడంతో వీరు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తుడా కార్యాలయం చుట్టూ తిరిగి వేసారిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డికి తమ సమస్యను మొరపెట్టుకున్నారు. ఆయన స్పందించి చొరవ తీసుకున్నారు. వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు లోకేష్, నారాయణల దృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా ఇక్కడి కొనుగోలుదారులకు 22ఏ నుంచి విముక్తి కల్పించారు. రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఉత్తర్వులు జారీ చేశారు.

పదిరోజుల్లో రిజిస్ట్రేషన్ చేస్తాం

మామండూరు బాధితులకు పది రోజుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేస్తామని తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, వీసీ శుభం బన్సల్‌లు తెలిపారు. బుధవారం తుడా కార్యాలయంలో ప్లాట్ల కొనుగోలుదారులతో వారు సమావేశం నిర్వహించారు. తమ సమస్య పరిష్కరించి పెద్ద ఊరటనిచ్చిన చైర్మన్‌ను ఈ సందర్భంగా బాధితులు ఘనంగా సత్కరించారు.

మదినిండా.. మారుతి జెండా

● ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలకు ముస్తాబవుతున్న గూడూరు



రూపుదిద్దుకుంటున్న ఆంజనేయస్వామి జెండా




గూడూరులో ఆంజనేయస్వామి జెండా గ్రామోత్సవం (ఫైల్ ఫొటో)

గూడూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దసరా అనగానే మైసూరు తరువాత గుర్తుకు వచ్చేది గూడూరు. నవరాత్రులకు ఒక రోజు ముందుగానే ఇక్కడ జరిగే జెండా ఉత్సవాలు మరీ ప్రత్యేకం. విజయదశమి ముందు వచ్చే అమావాస్య నాడు జరిగే ఈ వేడుకను పట్టణ ప్రజలు వైభవోపేతంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈసారి కూడా ఈనెల 21వ తేదీ రాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు జోరందుకున్నాయి.

ఇదీ జెండా వేడుక నేపథ్యం

గూడూరు ఏర్పడిన తొలినాళ్లలో అరిష్టాలు ప్రబలి వ్యాధులు విజృంభిస్తున్నాయని ప్రజలు భావించారు. ఆంజనేయస్వామిని పూజిస్తే కష్టాలు కడతేరుతాయని విశ్వసించారు. ఈక్రమంలోనే 77 ఏళ్ల క్రితం తొలిసారిగా బొడ్డుచౌక పాంతంలోని శక్తిరాయి వద్ద ఆంజనేయస్వామి జెండాను ప్రతిష్ఠించినట్లు చెబుతారు. జెండాకు ఆరు గజాల తెల్లని వస్త్రం వాడారు. దీనిపై సంజీవని పర్వతం తీసుకుని భూమిపై దిగుతున్న భంగిమలో ఆంజనీపుత్రుడి చిత్రాన్ని వేశారు. ఈజెండాను ఎనిమిది అడుగుల వెదురుకర్రకు అమర్చి విజయదశమి ముందు వచ్చిన అమావాస్యనాడు సాయంసంధ్య వేళ గ్రామోత్సవం నిర్వహించారు. ఈపూజల ఫలితంగా పట్టణంలో వ్యాధులు తగ్గుముఖం పట్టాయని జనం నమ్మి ఏటా అదేరోజుల ఆంజనేయస్వామి జెండా పండుగను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

వీధివీధినా పోటాపోటీగా..



ప్రస్తుతం పట్టణ వీధులలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌దీపాలంకరణ



కోనేటిమిట్టలో విద్యుద్దీపాలంకరణ (ఫైల్ ఫొటో)

పట్టణం విస్తరించింది. అదేతరహాలో పలు ప్రాంతాల్లో ఆంజనేయస్వామి జెండాలను ప్రతిష్టించడం మొదలైంది. ఇప్పుడు 40కి పైగా జెండాలేర్పడిన ఇక్కడ వీధుల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కాలానుగుణంగా ఈ పతాకాన్ని రంగురంగులతో ఆకర్షణీయంగా తయారుచేస్తున్నారు. సంజీవని పర్వతాన్ని మోసుకువస్తున్న ఆంజనేయస్వామి చిత్రపటాన్ని ట్రాక్టరుపై ఘనంగా ఊరేగిస్తారు. మేళతాళాలు,సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పోటాపోటీగా ఈ వేడుక జరుగుతోంది ఊరేగింపు ముందు తెనాలిబ్యాండు, బేతాళ, కాంతార నృత్యాలు, జింగిరి మేళం, తప్పెట్లు, తాళాలు, కోలాటాలు, కేరళ బ్యాండు, తీన్‌మార్, బొట్టబొమ్మల అభినయం, పార్వతీమహిషాసురల యుద్ధనాట్యాలు, ఆకర్షణగా నిలుస్తాయి.జెండా ఉత్సవాలు ముగిసిన మర్నాడు (ఈనెల 22న) నుంచి శరన్నవరాత్రుల నిర్వహణకు శ్రీకారం చుడతారు.ఈక్రమంలోనే జెండా పండగకు పట్టణ ప్రజలు సిద్ధమవుతున్నారు.

అరెస్టుకోసం భూమనకు ఉబలాటమెందుకు?

● తండ్రిని జైలుకు పంపేందుకు తనయుడి కుతూహలం ● చేసిన పాపాలకు శిక్ష తప్పదన్న కూటమి నేతలు



తిరుపతి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వైసీపీ నేతలైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాదిరిగానే అరెస్ట్ అయిపోయి వారి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెప్పు పొందేందుకు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఉబలాట పడుతున్నారు. తన తండ్రిని అరెస్టు చేయించేందుకు కుమారుడు అభినయ్ కూడా కుతూహలంగా ఉన్నారు. సానుభూతి కోసం నాటకాలు ఆడినంత మాత్రాన భూమన కుటుంబాన్ని ప్రజలు నమ్మే పరిస్థితులు లేవు' అని యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ జి.నర్సింహ యాదవ్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, ఏపీయూఐడీసీ డైరెక్టర్ ఊకా విజయ్ కుమార్, గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్ వ్యాఖ్యానించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వీరు మీడియాతో మాట్లాడారు. భూమన కుటుంబం అరెస్టు అవ్వాలని ఉద్దేశపూర్వకంగానే సోషల్ మీడియాలో రాద్ధాంతం చేశారన్నారు. శనీశ్వరుడి విగ్రహం వద్దకెళ్లి మహావిష్ణువు విగ్రహానికి అపచారం జరిగిందని, తిరుమల ప్రతిష్ఠతను దెబ్బతీస్తున్నారన్నారు. కాగా, శనీశ్వరుడి విగ్రహం వద్ద మంగళవారం జరిగిన విషయంపై ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే తన తండ్రిని అక్రమంగా అరెస్టు చేసేస్తున్నారంటూ అభినయ్‌రెడ్డి చేసిన ప్రచారం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల్లో సానుభూతి పొందేందుకు పోస్టర్లూ సిద్ధం చేయడం విపరీత పోకడలకు నిదర్శమన్నారు. తండ్రిని అరెస్టు చేయించేందుకు కుమారుడికి ఎందుకు అంత తొందరో తెలియడం లేదన్నారు. ఇదంతా కూడా జగన్‌రెడ్డి మన్ననలు పొందేందుకే అని విశదీకరించారు. కాగా, మంగళవారం సాయంత్రం ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. గతంలో మీరు చేసిన అక్రమాలు, అన్యాయాలపై విజిలెన్స్ విచారణ పూర్తయిందని, వీటిపై చట్టపరంగా భూమనపై చర్యలుంటాయన్నారు. భక్తుల కానుకలు, టీటీడీ నిధులను కాజేసిన చేసిన మిమ్మల్ని ఎందుకు వదిలిపెట్టాలని ప్రశ్నించారు. తిరుపతిలో అన్ని వ్యవస్థలను నాశనం చేసిన ఘనత భూమన కుటుంబానిదన్నారు. తిరుమలలో నెయ్యి కల్తీకి పాల్పడటం, రూ600 కోట్లతో పనులకు టెండర్లు పిలిచి నచ్చినవారికిచ్చి కమీషన్లు తీసుకోవడం, స్మార్టు సిటీ నిధులు, టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వీటన్నింటికీ సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. అంతేకానీ అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, అన్నింటికీ లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు.

ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయండి

● లండన్‌లో మంత్రి లోకేశ్‌కు పిచ్చాటూరు యువత విజ్ఞప్తి



మంత్రి లోకేశ్‌తో సోమపల్లి నందు

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది విశాఖ కేంద్రంగా నవంబర్ 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు తరలిరావాలని మంత్రి లోకేశ్ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. గ్లోబల్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికేందుకు లండన్‌లోని పాల్‌మాల్ కన్వెన్షన్ వేదికగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - యూకే బిజినెస్ ఫోరం రోడ్ షో నిర్వహించాయి. టెక్ మహీంద్ర యూరప్ బిజినెస్ హెడ్ హర్షుల్ అస్నానీ అనుసంధానకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో పిచ్చాటూరు సింగిల్‌విండో చైర్మన్ జయచంద్రనాయుడు తనయుడు సోమపల్లి నందు మాట్లాడారు. బంగళా గ్రామం నుంచి ఎన్‌హెచ్ 716బి చిత్తూరు- తచ్చూరు రోడ్డు అనుబంధంగా ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. ఈ పార్కు అభివృద్ధితో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించినట్లు నందు తెలిపారు. అనంతరం ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలను వివరించానని పేర్కొన్నారు. ఈ రోడ్ షోలో యూకే డిప్యూటీ హైకమిషనర్ సుజిత్ ఘోష్, ఐసీఐసీఐ బ్యాంక్ యూకే సీఈవో రాఘవ్ సింఘాల్, ఏపీఐఐసీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ అభిషిక్త్ కిశోర్, గ్లోబల్ ఫండ్, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్ కంపెనీల ప్రతినిధులు, గంధమనేని కామేష్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్లకు 22 నెలల జైలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడిన నలుగురు స్మగ్లర్లకు 22 నెలల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బుధవారం తీర్పు చెప్పారు. రాయచోటి డివిజన్ పరిధిలోని ఫారెస్టు లైజన్ అధికారి అనిల్‌కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు.. కేవీ పల్లె మండలం నూతన కాలువకు చెందిన ఎస్. రమణయ్య, ఎర్రిమల్లయ్య, శివ మల్లయ్య, ఎర్రావారిపాలెం మండలం ఉస్తికాయలపెంటకు చెందిన బి.మల్లికార్జున 2012లో సానిపాయి రేంజ్, దిన్నెల బీట్‌లో దాదాపు 31 ఎర్రచందనం దుంగలు అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్నారు. దీనిపై అందిన సమాచారంతో అప్పటి ఫారెస్టు బీట్ అధికారి సత్యనారాయణ, సిబ్బంది తనిఖీలు చేశారు. ఆ నలుగురు స్మగ్లర్లను పట్టుకుని కేసు నమోదు చేశారు. దీనిపై రాయచోటిలోని రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలు విచారించిన తర్వాత ఈ కేసును తిరుపతికి బదిలీ చేశారు. ఏపీపీ శాంతి వాదనలు వినిపించగా, ఫారెస్టు లైజన్ అధికారి అనిల్‌కుమార్ సాక్ష్యాధారాలను కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత నలుగురు స్మగ్లర్లకు 22 నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీకాంత్ తీర్పు చెప్పారు.

లా విద్యార్థి ఆత్మహత్య



మృతిచెందిన ఆరోగ్య స్టీఫన్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): న్యాయ విద్య చదువుతున్న విద్యార్థి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం తిరుపతిలో చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారికి చెందిన మరియా వియ్యప్పన్ కుమారుడు ఆరోగ్య స్టీఫన్(28) తిరుపతిలోని ప్రైవేటు లా కళాశాలలో నాలుగో సంవత్సరం లా విద్య చదువుతున్నాడు. చెడు స్నేహాల కారణంగా మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. మానసిక ఒత్తిడితో తరచూ తాను చనిపోతున్నానంటూ తల్లిదండ్రులకు మెసేజ్‌లు పెట్టేవాడు. 10 రోజుల క్రితం సోదరుడికి ఇదే రకమైన మెసేజ్ పెట్టాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు అతని ఫోన్ లిఫ్ట్ చేయడం, మెసేజ్‌లను పట్టించుకోవడం మానేశారు. మంగళవారం సాయంత్రం హాస్టల్ భవనంలోని ఐదో అంతస్తులో కూర్చుని మద్యం తాగడం తోటి విద్యార్థులు గమనించారు. తెల్లవారుజామున హాస్టల్ భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వార్డెన్ సమాచారం మేరకు ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మహబూబ్ బాషా ఘటనా స్థలికి చేరుకుని విద్యార్థులను విచారించారు. మద్యానికి బానిసకావడం, తల్లిదండ్రులు దూరం పెట్టడంతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని విద్యార్థులు చెప్పారు. మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

● మోదీ జన్మదినం సందర్భంగా

75 మంది నేతల రక్తదానం



రక్తదానం చేస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా బుధవారం తిరుపతిలోని బీజేపీ కార్యాలయంలో 75 మంది నేతలు రక్తదానం చేశారు. స్విమ్స్ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని అక్టోబరు 2వ తేదీ వరకు అనేక సేవా కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి తెలిపారు. రెండు వారాల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు కోరారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, నాయకులు జల్లి మధుసూదన్, మునికృష్ణయ్య, నరేష్, బాలాజీ పాల్గొన్నారు.

ఫేక్ పోస్టులతో మనోభావాలు దెబ్బతీయొద్దు

● ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ



తిరుపతి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి) : రాజకీయంగా ఎదగాలనుకునే మహిళలను టార్గెట్ చేస్తూ కొందరు సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులతో మనోభావాలు దెబ్బతీయొద్దని ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ కోరారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఫేక్ న్యూస్‌లు పెట్టి మనోభావాలు దెబ్బ తీసే పన్నాగాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. జాతీయ మహిళా సాధికారత సదస్సులో తీర్మానానికి భిన్నంగా కొందరు మహిళలు రాజకీయంగా ఎదుగుతుంటే కించపరుస్తూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. 2019లో వైసీపీ హవాలో కూడా తాను ఓడిపోలేదని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా కుట్రలు చేసి ఓడించారని పలుసార్లు చెప్పానన్నారు. కరుణాకర్‌రెడ్డికి పార్టీని తాకట్టు పెట్టానని తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరామన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, చినబాబు, బుల్లెట్ రమణ, సూరా సుధాకర్ రెడ్డి, కోడూరు బాలసుబ్రమణ్యం, డీజే కృష్ణ యాదవ్, పుష్పావతి, మన్యం శ్రీనివాసులు, మునిశేఖర్ రాయల్, బీజీ ఆనంద్ యాదవ్, విశ్వనాథం, రజనీకాంత్ నాయుడు, అనిత, హేమావతి, రజిని, కల్పన, జయంతి తదితరులు పాల్గొన్నారు.

పూడి వద్ద రిసార్టుల నిర్మాణం

● పులికాట్ తీరంలో పెట్టుబడులకు క్లబ్ మహేంద్ర ఆసక్తి

తడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ముందడుగు పడుతోంది. పులికాట్ తీర ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. తడ మండలం పూడి వద్ద పర్యాటకులను ఆకర్షించేలా రిసార్ట్‌ల నిర్మాణం చేపట్టేందుకు క్లబ్ మహేంద్ర సంస్థ ముందుకొచ్చింది. పూడి గ్రామ సర్వే నెంబరు 111లో సుమారు 20 ఎకరాల్లో రిసార్ట్‌లను నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో రెవెన్యూ అధికారులు క్లబ్ మహేంద్రకు భూములు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందంతో క్లబ్ మహేంద్ర ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. వన్యప్రాణి విభాగం అధికారుల నుంచి ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో త్వరలోనే రిసార్ట్‌ల నిర్మాణం చేపట్టే అవకాశం ఉందని, పర్యాటక రంగ అభివృద్ధికి ఇది ఎంతో దోహదం చేస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

అనుమానాస్పదస్థితిలో బాలుడి మృతి



లోకేష్ మృతదేహం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి చెందాడు. పిచ్చిరెడ్డి తోపులో నివాసం ఉంటున్న వెంకటకృష్ణ, తులసీ దంపతులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల తులసి ఓ ప్రైవేట్ కర్మాగారంలో పనిలో చేరగా, వెంకటకృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్తున్నాడు. బుధవారం ఉదయం వీరిద్దరూ పనులకు వెళ్లారు. రాత్రి ఏడు గంటల సమయంలో ఇంటికి వచ్చిన వెంకటకృష్ణ కుమారుడు లోకేష్(7) వరండాలో అచేతనంగా పడి ఉండడం గమనించాడు. వెంటనే నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెల్లగా అప్పటికే బాలుడు మృతి చెంది ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడు నోట్లో నురగ వచ్చి ఉండడంతో లోకేష్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేంకటేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం



స్వామివారికి పట్టు వస్త్రాలను తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు

తడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వాటంబేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం వేడుకలు బుధవారం ముగిశాయి. ఉదయం గోపూజ, స్వామివారికి విశేష పూజలు, కుంభాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఆలయ శిఖర కలశాలను అభిషేకించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, టీడీపీ నాయకులు బొమ్మన పళణి, మాధవ నాయుడు, జయరామయ్య, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై మహిళలకు అవగాహన

సూళ్లూరుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో బుధవారం నారీశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబమంతా బాగుటుందని, అందువల్లే నారీశక్తి కార్యక్రమంలో ఆరోగ్యంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించి అక్కడ రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, ఏఎంసీ చైర్మన్ రమేష్, సొసైటీ అధ్యక్షుడు బాలచంద్ర కిషోర్, హెచ్‌డీసీ కమిటీ సభ్యులు హనుమంతరావు, సరిత, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు ఈ-పోస్ యంత్రాల అందజేత

వాకాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సివిల్ సప్లయ్ కార్యాలయంలో బుధవారం కొత్త ఈ-పోస్ యంత్రాలను వాకాడు, కోట, చిట్టమూరు మండలాల తహసీల్దార్లు ఇక్బాల్ సయ్యద్, జయజయరావు, నరేష్ పంపిణీ చేశారు. వాకాడు తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ మాట్లాడుతూ వాకాడు మండలానికి 30, కోట మండలానికి 31, చిట్టమూరు మండలానికి 33 కొత్త ఈ-పోస్ యంత్రాలను అందజేసి, పాతవాటిని తిరిగి తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అఖిల్ యాదవ్, సివిల్ సప్లయ్ గోదాము డీటీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



లాంగ్‌జంప్ పోటీల్లో విద్యార్థులు

కోట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ గేమ్స్‌లో రెండో రోజు బుధవారం బాలుర విభాగంలో క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎంఈవోలు శిరీషా, మస్తానయ్య పర్యవేక్షణలో అండర్14, అండర్ 17విభాగాల్లో లాంగ్‌జంప్, షార్ట్‌పుట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. లాంగ్‌జంప్ 14 బాలుర విభాగంలో చిట్టేడు ఉన్నత పాఠశాలకు చెందిన చెంచు మణికంఠ, అండర్17 విభాగంలో విష్ణువర్ధన్ మొదటి స్థానం సాధించారు.

రైతులకు సేవలందించడమే బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఉయ్యాల ప్రవీణ్‌కుమార్

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలందించడమే బాధ్యతగా భావించి పనిచేస్తానని నాయుడుపేట ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం కార్యాలయంలో ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం తేదీ నిర్ణయంపై చర్చించారు. నిర్వహించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ త్వరలోనే పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు తెలిపారు. తమకు ఏఎంసీ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు అంకయ్య, కృష్ణయ్య, సుధాకర్, గోపీ, కోటేశ్వరరావు, పవిత్రారెడ్డి, కన్నెమ్మ, సుజాత, కేశవరెడ్డి, వేణెయ్య, బాబు, కస్తూరమ్మ, భాస్కర్, సుబ్రహ్మణ్యంరెడ్డి, సౌమ్య, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

తడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతిని సందర్భంగా బుధవారం బోడిలింగాలపాడు వద్ద ఉన్న కాళికామాత ఆలయంలో విశ్వకర్మ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు పరంధామ ఆచారి, నాయకులు బాబు, ఆర్ముగం, కృష్ణమూర్తి, రమేష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో...

సూళ్లూరుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో బుధవారం షార్ ఎంప్లాయూస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షార్ ఎంప్లాయూస్ ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ కమిటీ ఎంపిక

గూడూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవ నిలయంలో ఏబీవీపీ సమావేశం బుధవారం నిర్వహించారు. పట్టణ నూతన కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మల్లికార్జున్, శివచరణ్, హాసిని, యక్షిత, విఘ్నేష్, శశిధర్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి ఎంపీడీవోగా నారాయణ



బాలాయపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి ఎంపీడీవోగా దాసరి నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

చిట్టమూరు ఎంపీడీవోగా ఉమామహేశ్వరరావు

చిట్టమూరు, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు ఎంపీడీవోగా ఉమామహేశ్వర రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. వాకాడు డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు చిట్టమూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న మనోహర్ గౌడ్ చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరుకు బదిలీపై వెళ్లారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఉమామహేశ్వర రావును, బదిలీపై వెళ్లిన మనోహర్‌గౌడ్‌ను సిబ్బంది సన్మానించారు.



ఉమామహేశ్వరరావునును సన్మానిస్తున్న మనోహర్ గౌడ్, సిబ్బంది





అధ్వానంగా ఉన్న కోటపోలూరు రోడ్డు - గుంతల రోడ్డులో కోట-వాకాడు బస్సు ప్రయాణం

అధ్వాన రహదారులు... అవస్థల ప్రయాణం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలో పలు గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షమొస్తే చాలు దారంతా వర్షపునీరు నిలబడి పెద్దపెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. సూళ్లూరుపేట నుంచి కోటకు వెళ్లే ప్రధాన రహదారిలో కోటపోలూరు వద్ద దాదాపు రెండు కిలో మీటర్ల మేర రోడ్డు గోతులమయంగా ఉంది. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు వెళ్లాలన్న సాహసం చేయాల్సి వస్తోంది. అదేవిధంగా సూళ్లూరుపేట నుంచి తడ మండలం వాటంబేడుకు వెళ్లే రోడ్డు పలుచోట్ల గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. గొల్లుములువు రైల్వే గేటు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపునీటితో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కోటపోలూరు ప్రధాన రోడ్డు గ్రామం నుంచి తూర్పు హరిజనవాడ ఆబాక రోడ్డు వరకు మరీ అధ్వానంగా ఉంది. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. ఈ మార్గంలో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు పనుల నిమిత్తం సూళ్లూరుపేటకు వచ్చి పోతుంటారు. వర్షమొస్తే గుంతల్లో నీరు నిలబడి ప్రయాణం నకర ప్రాయంగా మారుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వాటంబేడు రోడ్డులో రైల్వేగేటు వద్ద గుంతల్లో వర్షపునీరు

ప్రశాంత వాతావరణంలో జెండా ఉత్సవాలు జరుపుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలను జరుపుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక రోటరీభవన్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జెండా ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మైసూరు తరువాత గూడూరులోనే దసరా ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం అనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఉత్సవాల్లో ఎటువంటి గొడవలకు తావులేకుండా ప్రశాంతంగా జరుపుకునేందుకు అధికారులకు సహకరించాలన్నారు. డీఎస్పీ గీతాకుమారి మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన జరగనున్న అంజేయస్వామి జెండా ఊరేగింపులో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు చేపడుతామన్నారు. భక్తిశ్రద్ధలతో జెండా ఉత్సవాలను నిర్వహించుకునేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు ప్రసాద్, సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్ఐ మహేష్, విద్యుత్‌శాఖ ఏఈ ఏడుకొండలు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, చంద్రమౌళి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, వేదికపై డీఎస్పీ గీతాకుమారి

డీఎస్సీ ఫలితాల్లో హనుమంతరావు ప్రతిభ



గూడూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా ఓజిలి మండలం ఆర్మేనిపాడు గ్రామానికి చెందిన హనుమంతరావు స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌లో ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. హనుమంతరావు తల్లిదండ్రులు శ్రీనివాసులు, గురవమ్మ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గూడూరులో నివాసముంటున్న హనుమంతరావు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసేవాడు. పదో తరగతి వరకు ఓజిలిలో చదివిన హనుమంతరావు డిగ్రీ, ఎమ్మెస్సీ, ఎంఈడీ గూడూరులో పూర్తి చేశారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



రక్తదానం చేస్తున్న ఎద్దల నరేంద్రరెడ్డి, బీజేపీ కార్యకర్తలు

పెళ్లకూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను పురష్కరించుకుని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా తాళ్వాయిపాడు గ్రామంలోని బీజేపీ కార్యాలయం నుంచి పెళ్లకూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. చిల్లకూరు వడ్డిపాలెంలోని చండికాపరమేశ్వరి ఆలయంలో మోదీ పేరిట ప్రత్యేక పూజలు చేశారు. పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బాలింతులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. రోగులకు రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం యువతతో కలిసి నరేంద్రరెడ్డి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, చిల్లకూరు పీఏసీఎస్ డైరెక్టర్ ఎద్దల రామకృష్ణారెడ్డి, గోగుతోటి మురళి, సోడవరం బాలకృష్ణ, మద్దాల వీరయ్య, రమణ, భరత్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులతో కోచ్ పవన్

నాయుడుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం జిల్లా రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. అండర్17 బాలికల విభాగంలో నాయుడుపేటకు చెందిన జి.దీపిక, డి.ఆక్షాయిని, అండర్14 బాలుర విభాగంలో చార్లెస్ చంద్రహాస్, ధనీష్‌నాయక్, అండర్14 బాలికల విభాగంలో పి.పూజిత ప్రతిభ చూపినట్లు కోచ్ పవన్‌కుమార్ తెలిపారు.

ఇరిగేషన్ కార్యాలయ ప్రారంభం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీహరికోట రోడ్డులో డీవీఎస్ కాలనీ వద్ద రూ.39 లక్షలతో నూతనంగా నిర్మించిన ఇరిగేషన్ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్నాళ్లు ఇరిగేషన్ కార్యాలయం లేక అధికారులు చెంగాళమ్మ ఆలయానికి చెందిన కాటేజీల్లో ఉంటూ విధులు నిర్వహించేవారని, ప్రస్తుతం సొంత భవనం నిర్మించి తన చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, సొసైటీ అధ్యక్షుడు బాలచంద్ర కిషోర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, దువ్వూరు మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్ ల్యాబ్ ప్రారంభం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం వర్చువల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ వర్చువల్ ల్యాబ్ వల్ల విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. ఇది భవిష్యత్తులో కొత్త ఆవిష్కరణలను చేపట్టేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో శివంయాదవ్, షాణికుమార్, శక్తిమురుగన్, మంజులమ్మ, దత్తాత్రేయశర్మ, విశ్వక్సేనారెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

డక్కిలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంబులూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెరుకూరు చెన్నయ్య మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. బుధవారం ఆయనను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అలాగే ఇటీవల బదిలీపై వెళ్లిన మరో ఉపాధ్యాయుడు మల్లిఖార్జునరావును కూడా గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు పాయశం గోపాల్, పొట్టా మునెయ్య, విద్యా కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

గూడూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమ్మదయ వృద్ధాశ్రమంలో బీజేవైఎం ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్, చిన్నా, వసంత్, చైతన్య, యశ్వంత్, కిరణ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక సరస్వతీ శిశుమందిరంలో ఎస్‌వీరత్నం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీకంటి రామమోహన్‌రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు.

దుప్పట్లు, ఆహార పొట్లాల అందజేత

గూడూరు అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ సౌత్ ఇండియా ఉపాధ్యక్షుడు కంకణాల పెంచల నాయుడు ఆధ్వర్యంలో స్థానిక సంగం థియేటర్ సెంటర్‌లో కేక్ కట్ చేశారు. పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలను అందజేశారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన వర్క్‌షాపు

కోట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు జరిగిన వర్క్‌షాపు బుధవారం ముగిసింది. ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో త్రిషాషా ప్రయతీష్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సూరత్‌కల్ నిట్ సహకారంతో ఆర్‌టీఎల్ కోడింగ్, ఎఫ్‌పీజీఏ బేసిడ్ డిజైన్ ఫ్రమ్ ఫండమెంటల్స్ టూ ఇంప్లిమెంటేషన్ అనే అంశాలపై విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. నిట్ ప్రొఫెసర్ శ్రీహరి మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపుల వల్ల విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. ప్రస్తుత టెక్నాలజీ రంగంలో ఆర్‌టీఐ కోడింగ్, డిజైన్ వంటి అంశాలు అత్యంత ప్రాధాన్యం కలిగి ఉన్నందున, విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని విస్తరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కరు ఆత్మహత్య

ఓజిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం సగుటూరుకు చెందిన కలపాటి రోహిణి (26) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు పెద్దపరియ పీహెచ్‌సీలో సగుటూరుకు ఆశా వర్కరుగా పనిచేస్తోంది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబంలో వివాదాల కారణంగా మనస్తాపానికి గురై ఉరివేసుకున్నట్లు తెలిసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

పేదలందరికీ పక్కా ఇళ్లు

నాయుడుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఎం అవాజ్ యోజన అర్బన్ 2.0 పథకం ద్వారా పేదలందరికీ పక్కా గృహాల నిర్మాణానికి అవసరమైన రాయితీ రుణాలు అందజేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా తెలిపారు. బుధవారం పీఎం అవాజ్ యోజన అర్బన్ 2.0 అంగీకార్ ప్రోగ్రామ్ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, టిడ్కో ఏఈ మునీష్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ద్వారా పేదలకు సొంతింటి కల సాకారమవుతుందని మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య అన్నారు. బుధవారం ఆయన గృహ నిర్మాణశాఖ అధికారులతో కలిసి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం బోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ఏఈ సత్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో జాబ్‌మేళా

తడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా జరిగింది. 237 మంది హాజరుకాగా, 133 మందికి వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు లభించాయి. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి సూళ్లూరుపేట నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో శేఖర్‌నాయక్, ఐటీఐ ప్రిన్సిపాల్ దేవదానం పాల్గొన్నారు.

అన్నదానం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం వేనాటి సోదరుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వేనాటి సురేష్‌రెడ్డి తనయుడు సాయి స్మరణ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేనాటి జనార్ధనరెడ్డి, గండవరం రమేష్‌రెడ్డి, మునిరాజా, వేనాటి మహేష్ రెడ్డి, సుమంత్‌రెడ్డి, చంద్రయ్య, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

వాకాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్టెంబాక గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. ఉపాధి కూలీలను సిబ్బంది ప్రోత్సహించి సకాలంలో పనికి వచ్చేలా చూడాలన్నారు. అనంతరం కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో విజయమ్మ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛోత్సవ్-స్వచ్ఛాతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.